# మన తొలివెలుగు

తెలుగు దినపత్రిక

RNI: TGBIL/26/A2289

www.manatolivelugu.in

CEO & Chief Editor : Vanga Nagaraj Reddy (Raju)

హైదరాబాద్ | శనివారం 1 ఆగస్టు 2026 | సంపుటి : 1 | సంచిక : 60 | పేజీలు : 8 | వెల : 2/-


## దేశ సరిహద్దు జిల్లాల బ్యాంకులకు ఆర్‌బీఐ కీలక ఆదేశాలు

దేశంలో నకిలీ కరెన్సీ చలామణిని అరికట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. పొరుగు దేశాలతో సరిహద్దులు పంచుకుంటున్న జిల్లాల్లోని అన్ని బ్యాంకు శాఖల్లో నోట్ల ప్రామాణికతను పరిశీలించే (అథెంటికేషన్), వేరుచేసే (సార్టింగ్) యంత్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. నకిలీ నోట్లను గుర్తించడంలో కొన్ని బ్యాంకుల పనితీరు సంతృప్తికరంగా లేదని గమనించిన ఆర్‌బీఐ, ఈ మేరకు నూతన సర్క్యులర్‌ను విడుదల చేసింది. బ్యాంకులకు వచ్చే ప్రతి నోటు ప్రామాణికతను యంత్రాల ద్వారా విధిగా నిర్ధారించుకోవాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఒకవేళ నకిలీ నోటును గుర్తిస్తే, దాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగదారుడికి తిరిగి ఇవ్వకూడదని లేదా బ్యాంకులోనే ధ్వంసం చేయకూడదని తేల్చిచెప్పింది. గుర్తించిన నకిలీ నోట్ల వివరాలను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత అధికారులకు నివేదించాలని సూచించింది.

## తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు తేదీ

# మరోసారి పెంపు

- తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు తేదీ మరోసారి పొడిగించిన ఈసీ
- ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించే గడువు ఆగస్టు 10 వరకు పొడిగింపు
- రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తి
- ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ పూర్తయినప్పటికీ, ఓటర్లు వాటిని నింపి ఇవ్వాల్సి ఉంది
- ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తవ్వాల్సి ఉంది



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) గడువు తేదీని ఎన్నికల సంఘం(ఈసీ) మరోసారి పొడిగించింది. ఆగస్టు3వ తేదీతో పూర్తి కావాల్సిన ఎన్యూమరేషన్ ప్రక్రియను ఆగస్టు 10వ తేదీ వరకు పొడిగిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది. ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ పూర్తయినప్పటికీ, ఓటర్లు వాటిని నింపి ఇవ్వాల్సి ఉంది. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తవ్వాల్సి ఉంది. జూన్ 25వ తేదీ నుంచి రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్? పూర్తయినట్లు ఈసీ తెలిపింది. హైదరాబాద్ నగరంలో 56.31 శాతం, రంగారెడ్డి జిల్లాలో 63.43 శాతం ఎన్యూమరేషన్ పూర్తయినట్లుగా ఎన్నికల సంఘం వెల్లడించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61.37శాతం - మిగతా3లో



ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో


## తగ్గనున్న వర్షాలు

- దక్షిణాదిలో 125 ఏళ్లలో లేనంతగా పెరిగిన రాత్రి ఉష్ణోగ్రతలు!
- దేశంలో మలిదశ రుతుపవన వర్షాలు సాధారణం కంటే తక్కువే
- వాతావరణ శాఖ అంచనా
- "ఆగస్టు-సెప్టెంబర్ కాలంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు

## రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ

# ప్రక్రియ షురూ

- రాష్ట్రంలో ప్రారంభమైన ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ
- తహశీల్దార్, మీ సేవా కేంద్రాల్లో ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇస్తారన్న ఉపముఖ్యమంత్రి భట్టి
- కుటుంబ సమాచారం, సభ్యుల వివరాలతో సర్టిఫికెట్ జారీ
- భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో ఫ్యామిలీ రిజిస్టర్ కీలకంగా మారే అవకాశం





హైదరాబాద్

రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ప్రారంభమైందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తహశీల్దార్, మీ సేవా కేంద్రాల్లో ఫ్యామిలీ ధ్రువపత్రాలు ఇస్తారని ఆయన తెలిపారు. కుటుంబ సమాచారం, సభ్యుల వివరాలతో సర్టిఫికెట్ జారీ చేస్తారని వెల్లడించారు. ఫ్యామిలీ సర్టిఫికేట్ అన్ని చోట్ల చెల్లుతుందని ఆయన స్పష్టం చేశారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కోసం రేషన్‌కార్డుల్లోని సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకోనున్నారు. పౌర సరఫరాలశాఖ డేటాను రెవెన్యూశాఖ తీసుకోనుంది. ఫ్యామిలీ రిజిస్టర్ డిజిటల్ రూపంలో ఉంటుంది. ప్రతీ కుటుంబానికి గుర్తింపు కార్డును ఇస్తారు. రేషన్ కార్డు నంబరునే ఫ్యామిలీ రిజిస్టర్ ఐడెంటిఫికేషన్ నంబర్ (ఫ్రిన్)?గా ఇవ్వాలని యోచిస్తున్నారు. రిజిస్టర్‌లో ప్రతి కుటుంబానికి రిజిస్టర్ ఐడెంటిఫికేషన్ నెంబరు, కుటుంబ యజమాని, - మిగతా3లో



## పీఎం కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు

- రూ.4.51లక్షల కోట్ల ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి రూ.3.15 లక్షల కోట్లు కేటాయింపు
- ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36,441 కోట్లు
- 'పీఎం కిసాన్' పథకం ద్వారా ఇప్పటివరకు 23 విడతల్లో మొత్తం 4.47 లక్షల కోట్లకు పైగా ఆర్థిక సహాయం




## పీవోకేలో పాకిస్థాన్ దమనకాండపై భారత్ సీరియస్

- అంతర్జాతీయ సమాజం దృష్టి సారించాలని పిలుపు
- పాకిస్థాన్‌ను జవాబుదారి చేయాలని భారత్ డిమాండ్- పీవోకేలో 40మంది పౌరులు మృతి చెందారన్న భారత్
- మరెంతోమంది గాయపడ్డారని భారత్ ఆందోళన

## మీ పెట్టుబడులకు

# రక్షణ

- వ్యాపారాలకు అనువైన వాతావరణం కల్పిస్తున్నాం
- ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఫ్యూచర్ సిటీకి రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- సీఐఐ ఉత్తరాది ప్రతినిధులతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించాం



హైదరాబాద్

పెట్టుబడులకు సురక్షిత స్థానమైన తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఉత్తరాది ప్రతినిధులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. పెట్టుబడులకు రక్షణగా నిలుస్తామని హామీ ఇచ్చారు. సీఎంతో సీఐఐ ఉత్తర భారత ప్రతినిధులు శుక్రవారం భేటీ అయ్యారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలనలో అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు, ఫార్మా, ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు తరలివచ్చాయని సీఎం తెలిపారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పాలనలో కొన్ని పాలసీలు ప్రవేశపెట్టారని.. వాటిని కొనసాగిస్తూనే తాము సరికొత్త పాలసీలు తీసుకువచ్చామని చెప్పారు. రాష్ట్రంలో - మిగతా3లో



## మరోసారి ఎల్ఆర్ఎస్

# గడువు పెంపు

- నవంబరు 30 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించేందుకు అవకాశం
- ఛార్జీలు 25 శాతం రాయితీతో చెల్లించే అవకాశం
- దరఖాస్తు రిజెక్టైతే ప్రాసెసింగ్ ఛార్జీలు మినహా 90 శాతం తిరిగి చెల్లించనున్న ప్రభుత్వం

హైదరాబాద్

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ రాయితీ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. నవంబరు 30 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజులు, ఛార్జీలు 25 శాతం రాయితీతో చెల్లించేందుకు అవకాశం కల్పిస్తూ మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక సీఎస్ జయేష్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఆర్ఎస్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల 67 వేల 107 మంది దరఖాస్తు - మిగతా3లో




## "కొంచెమైనా సిగ్గు మిగిలి ఉంటే- అమిత్ షాతో రాజీనామా చేయించండి"

- నీట్ లీకేజీ నిరసనకారులపై మోదీ సర్కార్‌వి కక్షసాధింపు చర్యలు
- మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు

## సరికొత్త శిఖరాలకు భారత్- యూకే వ్యూహాత్మక భాగస్వామ్యం

- ఇరు దేశాల ప్రధానుల ఫోన్ సంభాషణ
- బ్రిటన్ నూతన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆండీ బర్న్‌హామ్‌తో ఫోన్‌లో మాట్లాడిన భారత ప్రధాని మోదీ
- ఇరు దేశాల మధ్య ఈ నెలలోనే అమల్లోకి వచ్చిన చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం
- వ్యాపారాలు, కార్మికులు, వినియోగదారులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది






# సరికొత్త శిఖరాలకు భారత్- యూకే వ్యూహాత్మక భాగస్వామ్యం

భారత్, బ్రిటన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రిటన్ నూతన ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆండీ బర్న్‌హామ్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఫోన్?లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఇటీవల అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ద్వారా లభించే వాణిజ్య, పెట్టుబడి అవకాశాలను సంపూర్ణంగా ఉపయోగించుకోవాలని ఇరువురు నేతలు నిశ్చయించారు. భారత్- యూకే సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు ఇరు దేశాల ప్రధానులు అంగీకరించారు. ఇందులో భాగంగా పలు కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని నిర్ణయించారు ఇరు దేశాల మధ్య ఈ నెలలోనే అమల్లోకి వచ్చిన చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వ్యాపారాలు, కార్మికులు, వినియోగదారులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని బ్రిటన్ ప్రధాని బర్న్‌హామ్ అన్నారు. ఈ ఒప్పందం ద్వారా లభించే వాణిజ్య, పెట్టుబడి ప్రయోజనాలను ఉమ్మడి శ్రేయస్సు కోసం పూర్తిగా వాడుకుంటామని మోదీ స్పష్టం చేశారు. అహ్మదాబాద్ టూ మాంచెస్టర్ 'విజన్ 2035' యూకే ప్రభుత్వ అధికారిక ప్రకటన ప్రకారం, ఈ సంభాషణలో ఆండీ బర్న్‌హామ్ బ్రిటన్‌లోని భారతీయ సమాజం అందిస్తున్న సహకారాన్ని ప్రశంసించారు. ఈ క్రమంలో స్పందించిన ప్రధాని మోదీ, బర్న్‌హామ్ స్వస్థలమైన మాంచెస్టర్, గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాల మధ్య ఉన్న చారిత్రక పోలికను గుర్తు చేశారు. అహ్మదాబాద్‌ను మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా అభివర్ణించారు.





'యూకే- ఇండియా విజన్ 2035' ఫ్రేమ్‌వర్క్ ద్వారా ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్తామని బ్రిటన్ ప్రధాని బర్న్‌హమ్ అన్నారు. 'యూకే- ఇండియా టెక్నాలజీ సెక్యూరిటీ ఇనిషియేటివ్'కు తన పూర్తి మద్దతు ఉంటుందని బ్రిటన్ ప్రధాని ప్రకటించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలపై ఇరు దేశాలు కలిసి పనిచేయనున్నాయని అన్నారు. ఈ క్రమంలోనే పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితులపై ఇరు నేతలు చర్చించారు. అక్కడ ఉద్రిక్తతలను తగ్గించడానికి 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్' జలసంధిని తిరిగి ప్రారంభించడానికి కలిసికట్టుగా దౌత్యపరమైన కృషి చేయాలని అంగీకారానికి వచ్చారు.

### బ్రిటన్ ప్రధానికి మోదీ అభినందనలు

మరోవైపు బ్రిటన్ నూతన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన ఆండీ బర్న్‌హామ్‌కు ప్రధాని మోదీ మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ క్రమంలోనే ఆయన పదవీకాలం విజయవంతం కావాలని మోదీ ఆకాంక్షించారు. ఈ మేరకు ప్రధానమంత్రి మోదీ ఎక్స్?లో పోస్ట్ చేశారు. బ్రిటన్ ప్రధానితో మాట్లాడటం చాలా ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

# పీఎం కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు

దేశ సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి ఉద్దేశించిన పలు కీలక ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. శు క్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన దాదాపు రూ.4.51 లక్షల కోట్ల భారీ వ్యయంతో కూడిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు కేంద్ర మంత్రిమండలి పచ్చజెండా ఊపింది. దేశంలోని రైతులకు నిరంతర ఆర్థిక భరోసా కల్పించే పీఎం-కిసాన్ పథకాన్ని 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు మరో ఐదేళ్ల పాటు పొడిగించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.3,15,614 కోట్ల నిధులను కేటాయించినట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

### రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం

2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ కేంద్ర ప్రాయోజిత పథకం కింద అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.6000 ఆర్థిక సహాయం అందుతోంది. ఈ నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ప్రతి నాలుగు నెలలకొకసారి రూ.2000 చొప్పున మొత్తం జమ చేస్తున్నారు. 'పీఎం కిసాన్' పథకం ద్వారా ఇప్పటివరకు 23 విడతల్లో మొత్తం 4.47 లక్షల కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ పథకం అమలుపై నీతి ఆయోగ్ జరిపిన అధ్యయనంలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. దాదాపు 92 శాతం మంది లబ్ధిదారులు ఈ నగదును నేరుగా వ్యవసాయ పెట్టుబడుల కోసమే వినియోగిస్తున్నారని, తద్వారా 85 శాతం



మంది రైతుల వ్యవసాయ ఆదాయం మెరుగుపడటమే కాకుండా అప్పుల కోసం ఇతరులపై ఆధారపడటం కూడా తగ్గిందని నివేదిక స్పష్టం చేసింది.

### ఇంధన రంగాన్ని ప్రోత్సహించేందుకు 'సూర్య సరోవర్ యోజన'

పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు రూ.5,070 కోట్లతో 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేబినెట్ ఆమోదం తెలిపింది. జలాశయాలు, పారిశ్రామిక చెరువులపై సోలార్ ప్లాంట్ల నిర్మాణమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రస్తుతం ఉన్న 700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యాన్ని 5,000 మెగావాట్లకు పెంచనున్నారు. 10,000 మెగావాట్ల సామర్థ్యంతో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2026-27 నుంచి 2030-31 వరకు ప్రాజెక్టులను అమలులోకి తీసుకురానుండగా, 2032-33 వరకు కేంద్రం ఆర్థిక సహకారం అందించనుంది. ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల అధ్యయనానికి ఒక్కో ప్రాజెక్టుకు 50 లక్షల వరకు, అలాగే నిర్మాణ దశలో ప్రతి మెగావాట్‌కు కోటి చొప్పున కేంద్రం ఆర్థిక సహాయం చేయనుంది. ఈ పథకం ద్వారా ఏటా సుమారు కోటి టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గనున్నాయి. దాదాపు 16,000 నుంచి 17,000 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించడమే కాకుండా దేశీయ సోలార్, బ్యాటరీ తయారీ రంగానికి భారీ ఊతం లభించనుంది.

సముద్ర వనరుల పరిశోధన, వినియోగం దిశగా చేపడుతున్న రూ.84,084 కోట్ల విలువైన 'సముద్ర మంథన్' ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. క్రీడారంగాన్ని ప్రోత్సహించడానికి ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36, 441 కోట్లు మంజూరు చేశారు. రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ట్విన్ ట్యూబ్ సొరంగాల నిర్మాణాలకు గాను రూ.9,779 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. కాగా, పీఎం కిసాన్? పథకం పొడిగింపు వల్ల వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టే రైతులకు మేలు జరుగుతుందని ప్రభుత్వం అభిప్రాయపడింది. అలాగే, ఉత్పాదకత మెరుగుపడుతుందని, వ్యవసాయ సంబంధిత నష్టాలను తగ్గించడంలో, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఇది సహాయపడుతుందని తెలిపింది. ఈ పథకం ద్వారా, అర్హులైన రైతు కుటుంబాలకు 'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్' (ఐడీు) విధానం ద్వారా సకాలంలో నిధులు అందుతాయని పేర్కొంది.

# "కొంచెమైనా సిగ్గు మిగిలి ఉంటే- అమిత్ షాతో రాజీనామా చేయించండి"

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో విద్యార్థులపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తూ, వారిని బలవంతంగా నిర్బంధిస్తూ, మోదీ సర్కార్ విద్యార్థులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. దీనికి కారణమైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేత రాజీనామా చేయించాలని ఆయన ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. తమపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదనే నిబంధనపైనే యువత తమ ఆందోళనను విరమించుకున్నారని, కానీ ఇప్పుడు మోదీ సర్కార్ తన మాట తప్పిందని ఖర్గే విమర్శించారు.

జులై 20న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో విద్యార్థులు, నిరసనకారులు సంసద్ ఛలో మార్చ్ చేశారు. అప్పుడు నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చెలరేగింది. దీంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. బాష్పవాయువు ప్రయోగించారు. దీనితో ఇరువైపులా చాలా మందికి గాయాలయ్యాయి. దీనిని ఖర్గే ప్రస్తవిస్తూ, ఎక్స్ వేదికగా ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. "నరేంద్ర మోదీ, 10 రోజుల క్రితం మీ ప్రభుత్వం లాఠీలు, బెత్తాలు, పెల్లెట్ గన్?లను ఉపయోగించి యువతపై విరుచుకుపడింది. ఇప్పుడు విద్యార్థులు తమ నిరసనలు విరమించుకున్నారు. అయినా మీరు వారిపై ఎఫ్?ఐఆర్?లు నమోదు చేస్తూ, బలవంతంగా నిర్బంధిస్తూ కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి తమపై ఎలాంటి చర్యలు తీసుకోరనే షరతుపైనే యువత ఉద్యమాన్ని విరమించారు. కానీ మీ ప్రభుత్వాలు ఇచ్చిన మాటను తప్పాయి. యువతకు చెందిన సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేస్తున్నారు. యువతుల వ్యక్తిగత వివరాలను ఇంటర్నెట్?లో లీక్ చేస్తూ వేధిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కనీసం పార్లమెంట్?లో అడుగు పెట్టలేదు. జవాబుదారీతనం లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఇదంతా వారి అహంకారాన్ని సూచిస్తోంది. తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, మీ ఇమేజ్?ను కాపాడుకోవడానికి చేసే ఇలాంటి తంత్రాలు ఇకపై సాగవు. యువత మీ నిజస్వరూపాన్ని చూశారు. కొంచెమైనా సిగ్గు మిగిలి ఉంటే, వెంటనే అమిత్? షా చేత



రాజీనామా చేయించండి."

### మోదీ రీల్స్ చేయడంలో బీజీగా ఉన్నారు!

మరోవైపు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్? ప్రధాని మోదీపై తనదైన రీతిలో సెటైర్లు వేశారు. "ఓ వైపు ప్రధాని మోదీ రీల్స్ చేయడంలో బిజీగా ఉంటే, మరోవైపు పేపర్ లీక్ అయ్యింది" అని ఎద్దేవా చేశారు.

"ప్రధాని మోదీ రీల్స్-మేకింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంలో నిరంతరం బిజీగా ఉన్నారు. మోదీ ప్రభుత్వం ఫాస్ట్? ట్రాక్ కోర్టులకు సంబంధించిన కండితుడుపు చట్టాన్ని పార్లమెంట్?లో ఆమోదించింది. ఈ తరుణంలోనే దేశంలో మరో పేపర్ లీక్ వార్త వెలుగులోకి వచ్చింది. ఈసారి మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వరాష్ట్రమైన ఒడిశాలో ఈ ఘటన జరిగింది. జులై 27న ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్?కి చెందన పీజీ పరీక్ష జరుగుతుండగానే, దానికి సంబంధించిన ప్రశ్నాపత్రం వాట్సాప్?లో సర్క్యులేట్ అయినట్లు తేలింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ తన స్థిరమైన వైఖరిని స్పష్టం చేసింది. 2024లో అయినా లేదా ఇప్పుడు 2026లో అయినా కాంగ్రెస్ వాదన ఒక్కటే. కేవలం పేపర్ లీకేజీలకు కఠినమైన శిక్షలను చట్టబద్ధం చేయడం, కోర్టులను ఫాస్ట్? ట్రాక్? కోర్టులుగా ప్రకటించడం ఇక ఎంత మాత్రం సరిపోదు. మన విద్యావ్యవస్థలో పేరుకుపోయిన వ్యాపార ధోరణి, అవినీతిపై మనం మరింత విస్తృతమైన, నిజాయితీతో కూడిన చర్చ జరపాల్సిన అవసరం ఉంది. దేశంలో జరిగిన విద్యార్థి ఉద్యమం అసలు ఆశయం కూడా ఇదే. మోదీ ప్రభుత్వం ఈ ఆశయాన్ని కచ్చితంగా గౌరవించాలి" అని జైరాం రమేశ్ అన్నారు.

## పీవోకేలో పాకిస్థాన్ దమనకాండపై భారత్ సీరియస్

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పాక్ సాగిస్తున్న దారుణాలపై విదేశాంగ శాఖ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. పీవోకేలో జరుగుతున్న దారుణాలపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించి, పాకిస్థాన్‌ను జవాబుదారీ చేయాలని భారత్ డిమాండ్ చేసింది. పీవోకేలో శాంతియుతంగా జరుగుతున్న ఆందోళనలపై పాకిస్థాన్ ఉక్కుపాదం మోపుతోందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఆరోపించారు. పాక్ సైన్యం అణిచివేత చర్యల కారణంగా పీవోకేలో ఇప్పటికే 40మందికిపైగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, ఎంతోమంది తీవ్రంగా గాయపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న పౌరులను పాక్ రక్షణ మంత్రి 'శత్రువులు'గా ముద్రవేయడం, అమాయక ప్రజలపై పాక్ యంత్రాంగానికి ఎంత చిన్నచూపు ఉందో బట్టబయలైందని రణధీర్ జైశ్వాల్ విమర్శించారు. పాకిస్థాన్ యంత్రాంగం ద్వారా శిక్షణ, నిధులు, ఆయుధాలు పొందిన ముజాహిద్దీన్లు ఇప్పుడు తమకే ఎదురుతిరుగుతున్నారని పాక్ ప్రధాని రాజకీయ వ్యవహారాల ప్రత్యేక సహాయకుడు అంగీకరించారని ఆయన చెప్పారు. "మీరు, మనమందరం చూసినట్లుగా పాకిస్థానీ ప్రభుత్వం పీఓకేలో శాంతియుత పౌరులపై క్రూరమైన బలప్రయోగాన్ని కొనసాగిస్తోంది. ఈ అణచివేత కారణంగా 40 మందికి పైగా అమాయక ప్రజలు మరణించారు. ఇంకా చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. నిరసన చేస్తున్న పౌరులను పాక్? రక్షణ మంత్రి శత్రువులుగా ముద్ర వేసినప్పుడు, పీఓకేలోని అమాయక ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న సంపూర్ణ ధిక్కారం బట్టబయలైంది." అని జైస్వాల్ అన్నారు.

పీఓకేలో నిర్వహిస్తున్న ఎన్నికలు పాకిస్థాన్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించడాన్ని ప్రతిబింబిస్తున్నాయని వీజూా ప్రతినిధి రణ్?ధీర్ జైస్వాల్? అన్నారు. అణచివేతను ఎదుర్కొంటున్న వారు ఈ హింసపై స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కోరారని గుర్తు చేశారు. "అక్కడ నిర్వహించే ఎన్నికలు పాకిస్థాన్ ప్రభుత్వానికి అవమానకరమైన తిరస్కారంగా నిలుస్తున్నాయి. హింసాత్మక పాలనను ఎదుర్కొంటున్న ప్రజలు, అంతర్జాతీయ సంస్థలను విచారణ కోసం అభ్యర్థించారు. ఈ చట్టవిరుద్ధమైన హత్యలపై స్వతంత్ర దర్యాప్తు జరగాలి. పాకిస్థాన్ చర్యలను అంతర్జాతీయ సమాజం నిశితంగా పరిశీలించి, దాని దురాగతాలకు జవాబుదారీగా నిలబెట్టాలని మేము కోరాము." అని ఆయన అన్నారు.

పాకిస్థాన్ ప్రభుత్వం ప్రేరేపిత ఉగ్రవాదంపై అక్కడి ప్రధానమంత్రి రాజకీయ వ్యవహారాల ప్రత్యేక సహాయకుడు రాణా సనావుల్లా ఇటీవల చేసిన వ్యాఖ్యలపైనా రణ్?ధీర్? జైస్వాల్? స్పందించారు. భారత్‌ను దెబ్బతీసేందుకు పాక్ గతంలో ముజాహిదీన్లకు శిక్షణ ఇచ్చి, ఆయుధాలు సమకూర్చిందని జైస్వాల్ అన్నారు. వారే ఇప్పుడు తమ తుపాకులను సొంతం దేశంపై గురిపెట్టారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. హింస పేట్రేగిపోవడంతో అంతర్జాతీయ సంస్థలు స్వతంత్ర దర్యాప్తు చేయాలని అక్కడి ప్రజలే కోరుకుంటున్నారని చెప్పారు. "పాకిస్థాన్ ప్రభుత్వం శిక్షణ ఇచ్చి, నిధులు సమకూర్చి, ఆయుధాలు ఇచ్చి భారతదేశానికి పంపిన ముజాహిదీన్‌లే ఇప్పుడు తమ తుపాకులను దేశం వైపే తిప్పుకుని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారారు. ఈ విషయాన్ని పాక్? ప్రధానమంత్రి రాజకీయ వ్యవహారాల ప్రత్యేక సహాయకుడు బహిరంగంగానే అంగీకరించారు." అని వీజూా ప్రతినిధి అన్నారు. అంతకుముందు జియో న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన సనావుల్లా, పీఓకేలోని నిరసనకారులు ఒకప్పుడు తాము ముజాహిదీన్‌లుగా శిక్షణ ఇచ్చిన వారేనని అన్నారు. వారిని పోరాడటానికి పంపామని, కానీ ఈ రోజు వారు మా మెడలకు చుట్టుకున్నారని అంగీకరించారు.

పాకిస్థాన్? ఆక్రమిత కశ్మీర్?లోని ప్రజలు విస్తృతమైన ఎన్నికల అవకతవకలపై ఫిర్యాదు చేస్తున్నారు. రిగ్గింగ్, రాజకీయ జోక్యం, ప్రజాస్వామ్య హక్కులను క్రమపద్ధతిలో అణచివేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లో క్షీణిస్తున్న మానవ హక్కుల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ సమాజం తక్షణమే జోక్యం చేసుకోవాలని యునైటెడ్ కాశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ (ఖఖూచీూ) కూడా పిలుపునిచ్చింది. యూరోపియన్ యూనియన్, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్విట్జర్లాండ్, స్వీడన్, నార్వే, రష్యా, చైనా, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు, ప్రపంచ మీడియాకు ఖఖూచీూ విజ్ఞప్తి చేసింది. జీవన వ్యయాలు పెరగడం, పరిపాలనపరమైన సమస్యలు, మైనార్టీలపై రాజకీయ వివక్ష తదితర అంశాలకు నిరసనగా గత నెల నుంచి పీవోకేలో ఆందోళనలు మిన్నంటుతున్న సంగతి తెలిసిదే. ది జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) దీనికి నాయకత్వం వహిస్తోంది.

## ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తగ్గనున్న వర్షాలు



రైతులు పంటలు వేసే వేళ భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం తన నెలవారీ అంచనాలు వెల్లడించింది. మలిదశ రుతుపవన వర్షాలు సాధారణంగా కంటే తక్కువగా కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అంటే ఆగస్టు, సెప్టెంబర్? వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదువుతుందని అంచనా వేసింది. ఆగస్టు-సెప్టెంబర్ కాలంలో దేశవ్యాప్త వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్పీఏ)లో 94 శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఒక నెల లేదా సీజన్‌లో నమోదైన వర్షపాతాన్ని, సాధారణంగా 30 నుంచి 50 సంవత్సరాల సుదీర్ఘ కాలానికి సగటుగా లెక్కించడాన్ని ఎల్పీఏ అంటారు. 1971 నుంచి 2020 వరకు చారిత్రక డేటా ప్రకారం, ఆగస్టు-సెప్టెంబర్ కాలానికి దేశవ్యాప్త సగటు వర్షపాతం (ఎల్?పీఏ) 422.8 మి.మీ.గా ఉంది.

### ప్రాంతాలవారీగా ప్రభావం ఎలా ఉంటుందంటే?

వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర మాట్లాడుతూ, "ఆగస్టు-సెప్టెంబర్ కాలంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. అయితే దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, మధ్య భారతదేశం, వాయువ్య భారతదేశంలోని ఉత్తర ప్రాంతాలు, తూర్పు, ఈశాన్య భారతదేశాల్లో మాత్రం సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉంది" అని తెలిపారు.

అయితే, దేశవ్యాప్తంగా ఆగస్టు నెలలో కూడా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. 1971-2020 గణాంకాల ప్రకారం, ఆగస్టు నెలలో దేశంలో వర్షపాతం సూూ 254.9 మి.మీ.గా ఉంది. ప్రస్తుతం, జూన్, జులై నెలల మధ్య కాలానికి సంబంధించి 13 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ నెలాఖరు నాటికి ఈ లోటు 35.4 శాతంగా ఉండేది. అయితే, జులైలో మంచి వర్షపాతం నమోదవ్వడం కారణంగా ఈ వర్షపాత లోటు తగ్గిందని డాక్టర్ మహాపాత్ర తెలిపారు. "జులై నెల సాధారణ సగటు వర్షపాతం 280.5 మి.మీ కాగా, ఈ ఏడాది దేశంలో 283.3 మి.మీ వర్షపాతం నమోదైంది. అయితే, దీనికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. బంగాళాఖాతంలో నాలుగు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడ్డాయి. వాటిలో రెండు తీవ్రతరం చెంది వాయుగుండాలుగా మారాయి" అని ఆయన పేర్కొన్నారు. జులై మొదటి వారంలో గాలి, మేఘాల కదలికల వ్యవస్థ (వీజీూ) భారతదేశానికి అనుకూలమైన దశలో ఉండటం వల్ల దక్షిణ భారతం మీదుగా రుతుపవన మేఘాలు ఉత్తరం వైపు విస్తరించి భారీ వర్షాలు పడ్డాయి. అయితే జులై చివరి భాగంలో ఇది ప్రతికూలంగా మారింది. కాగా, భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, గత ఐదేళ్లలో అత్యధిక సంఖ్యలో 'అత్యంత భారీ వర్షపాత' సంఘటనలు (204.5 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం) కూడా ఈ జులైలోనే నమోదయ్యాయి. ఇవి ప్రధానంగా ఒడిశా, గుజరాత్, మహారాష్ట్రల్లో కేంద్రీకృతమై ఉన్నాయని డాక్టర్ మహాపాత్ర పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా చూస్తే ఈ ఏడాది జులైలో సాధారణం కంటే కొంచెం ఎక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో మాత్రం 1901 తర్వాత లోటు వర్షపాతం నమోదైంది.

### ఆ రాష్ట్రాల్లో భారీ వర్షాలు

ఇదిలా ఉండగా, కేరళ, అసోం, అరుణాచల్ ప్రదేశ్, ఇతర ఈశాన్య రాష్ట్రాలతో సహా దేశంలోని పలు ప్రాంతాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములతో కూడిన వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రుతుపవన కాలంలో పలు రాష్ట్రాలు వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాలతో సతమతమవుతున్న తరుణంలో ఈ తాజా హెచ్చరికలు వెలువడ్డాయి.

# మరోసారి ఎల్ఆర్ఎస్ గడువు పెంపు

-మొదటిపేజీ తరువాయి

చేసుకున్నారు. వారిలో ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చునని లేఖలు 20 లక్షల 493 మందికి పంపించారు. రాయితీ గడువు పలుమార్లు పొడిగించినప్పటికీ దరఖాస్తుదారుల నుంచి అంతంత మాత్రమే స్పందన వస్తోంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు రిజెక్టైతే 10 శాతం ప్రాసెసింగ్ ఛార్జీలు మినహా మిగతా 90 శాతం తిరిగి చెల్లించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇవాల్టితో గడువు ముగియడంతో ఎస్ఐఆర్ ప్రక్రియ, వర్షాలు తదితర కారణాల వల్ల పొడిగించాలని క్యూర్ పరిధిలోని కార్పొరేషన్ల కమిషనర్లు ప్రభుత్వాన్ని కోరారు.

**ఈ నేపథ్యంలో మరోసారి పొడిగింపు**

గత ప్రభుత్వ హయాంలోనే ఎల్ఆర్ఎస్ పథకం ప్రకటించారు. అయితే దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా 25.70 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంవత్సరం మార్చిలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు తొలుత 50% ఆ తర్వాత 25% రాయితీ ప్రకటించారు. అప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారు తాము చెల్లించాల్సిన ఫీజులో 25% మినహాయించుకొని మిగతాది చెల్లిస్తే అనుమతులిస్తారు. ఈ రాయితీ గడువును పెంచుకుంటూ వస్తున్నారు. సర్ వల్ల ఎల్ఆర్ఎస్‌పై దృష్టి పెట్టలేకపోయామని, దీన్ని మరోమారు పొడిగించాలని పలువురు అధికారులు ప్రభుత్వాన్ని కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మరోసారి పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**25 శాతం రాయితీతో ఒటీఎస్?**

తెలంగాణలో అనధికార స్థలాల క్రమబద్ధీకరణను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం రాయితీతో ఒటీఎస్?(వన్? టైమ్? సెటిల్?మెంట్)ను ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి గత బీఆర్?ఎస్ ప్రభుత్వం హయాంలోనే ఎల్?ఆర్?ఎస్? పథకం ప్రారంభమైంది.




పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే ఉద్దేశంతో ప్రభుత్వం గత సంవత్సరం ఫిబ్రవరిలో 25 శాతం రాయితీతో ఓటీఎస్‌ను ప్రకటించింది.

**దరఖాస్తును తిరస్కరిస్తే ఇలా**

లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్)లో భాగంగా దరఖాస్తును తిరస్కరిస్తే ఆ తేదీ నుంచి వారం రోజులలోగా అప్పిలేట్ కమిటీకి అప్పై చేయవచ్చని టౌన్ ప్లానింగ్ విభాగం వెల్లడించింది. దరఖాస్తుదారు తన అప్లికేషన్ ఏ స్థాయిలో ఉందో తెలుసుకొనేందుకు అధికారిక వెబ్‌సైట్ https://lrs.telangana.gov.in/layouts/0revU5XZO4JF లింకును ఓపెన్ చేసి పరిశీలించవచ్చు. ఇందులో అడిగినట్లుగా దరఖాస్తు నంబరు టైప్ చేస్తే పూర్తి వివరాలు మనకు కనిపిస్తాయి.

**పూర్తి ఫీజు చెల్లించాల్సిందే**

అనధికార లేఅవుట్లలో అంటే 2020 ఆగస్టు 26కు ముందు రిజిస్ట్రేషన్ అయిన స్థలాలకు ఎల్ఆర్ఎస్ కింద ఫీజు చెల్లించి రెగ్యులరైజ్? చేసుకోవాలి. ఒక వ్యక్తి 300 గజాలకు ఆ సమయంలో రుసుం చెల్లించి ఆ తరవాత అందులో కొంత అమ్మినా సరే ఇప్పుడు మొత్తం 300 గజాలకు పూర్తి ఫీజు కట్టాల్సి వస్తోంది. నాడు రుసుం కట్టిన తరవాత కొంత అమ్మేశానని, అమ్మిన దానికి పూర్తి ఫీజు ఇప్పుడు చెల్లిస్తామంటే మాత్రం పని జరగదు.

# వర్షాలు, వరదలతో పలు చోట్ల నిలిచిన రాకపోకలు, నీటమునిగిన పంట పొలాలు

ఉత్తర తెలంగాణలో మూడోరోజు వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టడంతో వరదల తీవ్రత తగ్గింది. కానీ ఎగువ నుంచి గోదావరికి వస్తున్న వరదతో పలు చోట్ల రాకపోకలు నిలిచిపోగా వరి, పత్తి, సోయా పంటలు నీట మునిగాయి. సింగరేణి బొగ్గుగనుల్లో వర్షపు నీరు నిలిచి ఉత్పత్తి ఆగిపోయింది. ఎల్?నినో ప్రభావంతో వెలవెల బోయిన గోదావరి పరివాహక ప్రాంతం రెండ్రోజులుగా కురిసిన వర్షంతో జలకళను సంతరించుకుంది.



**పంట చేలలోకి వరద**

రెండ్రోజులుగా కురిసిన వర్షాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవహిస్తున్న నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని భీంపూర్ మండలం గుబిడి గుండా ప్రవేశించే పెన్ గంగ నది ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెటి వద్ద ప్రాణహిత నదికి వరదనీరు వచ్చి చేరుతోంది. పరివాహక ప్రాంతాలైన భీంపూర్, జైనథ్, బేలా మండలాల్లో పంట చేలలోకి వరద చేరి పత్తి, సోయా వంటి పంటలు నీట మునిగాయి. నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి జోరందుకుంది. సింగరేణి ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా స్తంభించింది.

మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలో పలు గనుల్లోకి వరద నీరు చేరడంతో ఉత్పత్తికి అంతరాయం కలిగింది. వరద నీరు కాలువలుగా మారడంతో భారీ వాహనాలు ఉపరితలంలోనే నిలిచిపోయాయి. పెద్దపల్లి జిల్లా కన్నాల పరిసరాల్లోని బొగ్గుబావి నుంచి మట్టి దిగువనున్న పంట పొలాల్లో చేరుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదే విధంగా ప్రతీ ఏడాది మట్టి కొట్టుకొచ్చి పంటలు నాశనం అవుతున్నాయని రైతులు వాపోయారు.

**నిండుకుండలా చెరువులు, కుంటలు**

నిజామాబాద్ జిల్లాకు ముసురు పట్టింది. డిచ్‌పల్లి, సిరికొండ, ధర్పల్లి, మోపాల్, జక్రాన్ పల్లి, ఇందల్వాయి మండలాల్లో వర్షం పడుతుంది. ఇప్పటికే కురిసిన భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తున్నాయి. డిచ్‌పల్లి మండలంలోని బర్దిపూర్ కోణంచెరువు అలుగు పారుతోంది. ధర్పల్లి మండలంలోని వాడి, ముత్యాలమ్మ వాగులకు వరద భారీగా వస్తుంది. బోధన్ నియోజకవర్గంలోని కందకుర్తి త్రివేణి సంగమం వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతుంది. నదిలోని శివాలయం నీటమునిగింది.

**పెద్ద చెరువుకు గండి**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి తాగునీటికి ఆధారమైన పెద్ద చెరువు నుంచి నీరు వెళ్లిపోవడంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెరువు మత్తడి పక్కన గట్టును కొద్దివరకు తొలగించడంతో చెరువులో ఉండాల్సిన నీరంతా పొంగిపొర్లి వాగులో కలిసిపోతోంది. చెరువులోని చేపలు సైతం బయటకు కొట్టుకుపోయాయి. పురపాలక, నీటిపారుదల అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే చెరువు ఖాళీ అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**కూలిన పాఠశాల**

వర్షాలకు సంగారెడ్డి మండలం కల్పగూర్?లోని ఉన్నత పాఠశాలలోని రికార్డు గదిలో రేకులు కూలాయి. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఘటన జరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. శిథిలావస్థలో ఉన్న గదుల మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

**డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయట్లేదు**

ములుగు జిల్లా వాజేడులోని పలు ఇళ్లలోకి గోదావరి వరద భారీగా చేరింది. అధికారులు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు చేపట్టగా పలువురు స్థానికులు నిరాకరించారు. ప్రతి ఏటా వరదల సమయంలో వేరే ప్రాంతాలకు తరలించడం తప్ప తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయట్లేదని బాధితులు వాపోయారు.

**వరదలో చిక్కుకున్న వారిని బయటకు చేర్చి**

కొత్తగూడెం జిల్లా చర్ల వద్ద ఇసుక ర్యాంపులో చిక్కుకున్న 50మంది వ్యక్తులను అధికారుల సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఇసుక కోసం వెళ్లగా ఒక్కసారిగా వరద పోటెత్తడంతో ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతోనే గోదావరి తీరంలోనే మిషన్ ఆపరేటర్లు, లారీ డ్రైవర్లు, క్లీనర్లు ఉండిపోయారు. దీనిపై స్పందించిన అధికారులు వారిని పడవల్లో ఒడ్డుకు చేర్చారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో భద్రాద్రి జిల్లా పర్ణశాల వద్ద సీత వాగు ఉప్పొంగింది. ఈ ప్రవాహంతో పర్ణశాల వద్ద గల నార చీరల ప్రాంతం సీతమ్మ వారి విగ్రహం మునిగాయి. దీంతో అధికారులు భక్తులను పరిసర ప్రాంతాలకు అనుమతించట్లేదు.

# పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

**జూరాల 24 క్రస్టు గేట్ల ఎత్తివేత**

**శ్రీశైలం ప్రాజెక్టులోకి 1.31 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

**ధరూరు/అచ్చంపేట:** ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులోకి భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 1.04 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు 1.22 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. కృష్ణానది వరద ప్రవాహాన్ని బట్టి ఉదయం నుంచి క్రమక్రమంగా క్రస్టు గేట్ల సంఖ్యను పెంచుతూ నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు 24 క్రస్టు గేట్లను ఎత్తి స్పిల్‌వే ద్వారా 95, 592 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా మరో 35,502 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతు న్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.01 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు భారీ ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వస్తోంది. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ప్రాజెక్టుకు జూరాల నుంచి స్పిల్‌వే, విద్యుదుత్పత్తి ద్వారా 1,31,094 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 834.40 అడుగులతో 54 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు.



## మీ పెట్టుబడులకు రక్షణ

-మొదటిపేజీ తరువాయి

విధానపరమైన స్తబ్దత లేదని.. నాయకులు ఎవరైనా, పార్టీ ఏదైనా మంచి పాలసీ తీసుకొస్తే అది కొనసాగుతోందన్నారు. ఫారూచ్యన్ 500 కంపెనీలు భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలనేది తమ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కాలుష్యంతో ఢిల్లీ, వర్షాలతో ముంబై, ట్రాఫిక్ కష్టాలతో బెంగళూరు, ప్రకృతి వైపరీత్యాలతో చెన్నై సతమవుతున్న నేపథ్యంలో భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించామని సీఎం చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ప్రాంతాన్ని క్యూర్‌గా గుర్తించామని, ఇక్కడ సేవా రంగానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఔటర్ నుంచి రీజనల్ రింగ్‌రోడ్డు వరకు ప్రాంతాన్ని ప్యూర్‌గా గుర్తించామని.. అక్కడ తయారీ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రీజనల్ రింగ్‌రోడ్డు వెలుపల వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు రేవంత్ వివరించారు. హైదరాబాద్ పరిధిలోని పరిశ్రమలను ప్యూర్ ప్రాంతానికి తరలిస్తామని స్పష్టం చేశారు. రేడియల్ రోడ్లు నిర్మిస్తామని.. పోర్టుకు అనుసంధానంగా రహదారులు అభివృద్ధి చేస్తామన్నారు. ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం పోర్టు వరకు 12 లేన్ల రహదారి నిర్మిస్తున్నామని తెలిపారు.

**రెట్టింపు ఆదాయం..**

తెలంగాణ సంస్కృతి తమకు పెద్ద ఆస్తి అని.. హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాల ప్రజలున్నారని సీఎం చెప్పారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టిన దానికి రెట్టింపు ఆదాయం వస్తుందన్నారు. పారిశ్రామికవేత్తలు కోరిన వసతులు కలిపస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిత్యం అందుబాటులో ఉంటారని చెప్పారు. పరిశ్రమల శాఖ మంత్రి రెండు నెలలకోసారి, తాను మూడు నెలలకోసారి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. తెలంగాణను తమ సొంత ప్రాంతంగా భావించాలని సీఐఐ ప్రతినిధులకు సీఎం సూచించారు.

**డిమాండ్ ఉన్న కోర్సులే..**

ఏఐ సునామీతో వైట్‌కాలర్ ఉద్యోగాలు పోతున్నందున తాము నైపుణ్యాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పామని చెప్పారు. ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని.. వాటిలో శిక్షణ పొందిన వారికి 100 శాతం ఉద్యోగాలు వచ్చాయన్నారు. డిమాండ్ ఉన్న కోర్సులనే బోధిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని జీసీసీల్లో 200 కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయని చెప్పారు. డేటా సెంటర్లపై అమెజాన్ రూ. లక్ష కోట్లు, అదానీ రూ. 35 వేల కోట్లు పెట్టుబడి పెడుతున్నాయని వివరించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, సీఐఐ ఉత్తరాది వైస్ చైర్మన్ శారదా సూరి మార్వా తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు తేదీ మరోసారి పెంపు

-మొదటిపేజీ తరువాయి

ఎన్యుమరేషన్ పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా 3.38కోట్లకు పైగా ఓటర్లు ఉండగా ఇంకా సుమారు 60 లక్షల మంది ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించలేదు. వారిలో సుమారు 30లక్షల మంది అన్?కలెక్టెబుల్ కేటగిరీలో ఉన్నట్లు బీఎల్ఓలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి నివేదించినట్లు తెలుస్తోంది. చనిపోవడం లేదా శాశ్వతంగా మరో ప్రాంతానికి వెళ్లిపోవడం లేదా పూర్తిగా అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల ఫారాలు ఇవ్వడం లేదని గుర్తించారు. అలాంటి ఓటర్ల పేరు ముసాయిదా జాబితా నుంచి తొలగించే అవకాశం ఉంది.

తెలంగాణలో చేపట్టిన సర్ ప్రక్రియపై కీలక సమాచారం వెల్లడైంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల ఓట్లను మళ్లీ తిరిగి వెనక్కి తీసుకునేందుకు వీలు లేని (అన్‌కలెక్టబుల్) వాటిగా పరిగణిస్తూ వాటిని తొలగించేందుకు ఎన్నికల అధికారులు సిద్ధమవుతున్నట్లుగా సమాచారం. సర్వే పూర్తయిన ప్రాంతాల్లో ఓటర్లకు నూరు ఎన్యూమరేషన్? పత్రాలు అందించామని, వాటిలో కొన్ని పత్రాలు సేకరించేందుకు వీలు లేకుండా ఉండటంతో వాటిని అన్?కలెక్టబుల్?గా నిర్ధారిస్తున్నట్లు అధికారులు గణాంకాలతో చూపిస్తున్నట్లు తెలిసింది.

**రెండు వారాల్లోనే 13 లక్షల నుంచి 40 లక్షలకు**

అన్‌కలెక్టబుల్ జాబితాలో ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ (ఏఎస్‌డీ) కేటగిరీ కింద ఉండే ఓటర్లను చేరుస్తూ, వారి ఓట్లను తీసివేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు ఎన్నికల సంఘం(ఈసీ) అధికారులు చెబుతున్నారు. అయితే 14 రోజుల కిందట సోషల్ మీడియాలో ఎలక్షన్ కమిషన్? డ్యాష్?బోర్డు వైరల్? అయ్యింది. అందులో 13 లక్షల మంది ఓటర్లు ఏఎస్?డీ పరిధిలో అన్?కలెక్టబుల్? కింద నమోదైనట్లుగా అధికారులు పేర్కొన్నారు. ఈ సంఖ్య రెండు వారాల్లోనే 40 లక్షలకు చేరుకోవడం గమనార్హం.

## రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ షురూ




-మొదటిపేజీ తరువాయి

కుటుంబ సభ్యులందరి పేర్లు, వయసు, కుటుంబ పెద్దతో బంధుత్వం, ఆధార్ నంబరు, చిరునామా తదితర వివరాలు ఉంటాయి. ప్రజలకు అవసరమైనప్పుడు మీ-సేవ కేంద్రాల ద్వారా కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్?ను ఇస్తారు. మీ సేవలో రెవెన్యూ సర్వీసుల విభాగంలో ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ అనే కొత్త సర్వీసు రానున్నట్లుగా తెలుస్తోంది.

**డేటా ఫ్యామిలీ రిజిస్టర్‌కు అనుసంధానం**

మీ సేవ సెంటర్లు , యాప్, వాట్సప్ ద్వారా నిర్ణీత రుసుము చెల్లించి ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసిన రెండు రోజుల్లోనే సంబంధిత మండల తహసీల్దార్ రేషన్ కార్డు డేటా ఆధారంగా డిజిటల్ సైన్?తో మీ సేవ ద్వారా ధ్రువపత్రాన్ని జారీ చేస్తారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కుటుంబ సభ్యుల వివరాల కోసమేనని ఆస్తులపై హక్కులు, లీగల్ హెయర్ నిర్ధరణకు ఉపయోగపడదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

కుటుంబ రిజిస్టర్‌లో నమోదైన వివరాలన్నీ ధ్రువపత్రంలో ఇవ్వనున్నారు. పౌర సరఫరాల శాఖ డేటాను ఫ్యామిలీ రిజిస్టర్‌కు అనుసంధానం చేయడంతో పాటు మీ సేవ ద్వారా సర్టిఫికెట్?ను జారీ చేసేందుకు అసరమైన సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేయాలని ఎలక్ట్రానిక్ సేవల డెలివరీ విభాగాన్ని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. అవసరమైన వివరాలను ఈఎస్‌డీ విభాగానికి ఇవ్వాలని సివిల్? సప్లైస్?శాఖకు స్పష్టం చేసింది.


**ఎందుకోసం ఈ ఫ్యామిలీ రిజిస్ట్రేషన్**

ప్రభుత్వ పథకాలు, ఇతర అవసరాల కోసం కుటుంబ వివరాల ధ్రువీకరణకు సంబంధించి ఇప్పటి వరకు సరైనటువంటి రికార్డులు లేవు. లబ్ధిదారుల కుటుంబ సభ్యుల వివరాల కోసం వారు చెప్పిందే నమ్మాల్సిన పరిస్థితి. ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన అధికారిక సర్టిఫికెట్ పొందే అవకాశం లేదు. ఇలాంటి సమస్యలన్నింటికీ చెక్ పెట్టేందుకు అధికారికంగా ఫ్యామిలీ రిజిస్టర్?ను తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో ఫ్యామిలీ రిజిస్టర్ కీలకంగా మారే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్, హరియాణా, కర్ణాటక, ఉత్తరాఖండ్, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాలు పలు పేర్లతో రాష్ట్ర స్థాయి కుటుంబాల డేటా బేస్?ను నిర్వహిస్తున్నాయి. ఫ్యామిలీ రిజిస్టర్ నిర్వహణ, ప్రజలకు సర్టిఫికెట్ ఇచ్చే బాధ్యతను ప్రభుత్వం రెవెన్యూ శాఖకు అప్పగించింది. ఫ్యామిలీ రిజిస్టర్, సర్టిఫికెట్ల విధి విధానాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్? కుమార్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు.

మన తొలివెలుగు

# తెల్ల ఏనుగులా మారిన పశ్చిమాసియా యుద్ధం

పశ్చిమాసియా యుద్ధం అమెరికా పాలిట తెల్లఏనుగులా మారింది. యుద్ధం కోసం అమెరికా దాదాపుగా 3.6 లక్షల కోట్లు ఖర్చు పెడుతోంది . ఇదే విషయాన్ని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వెల్లడించారు. యుద్ధాన్ని కొనసాగించేందుకు, క్షీణిస్తున్న వనరులను తిరిగి సమకూర్చుకునేందుకు మరిన్ని అత్యవసర నిధులు కావాలని ట్రంప్ ప్రభుత్వం కోరుతున్న నేపథ్యంలో ఆయన ఈ వివరాలను చట్టసభ సభ్యులకు అందించారు. సెనేట్ అప్రాప్రియేషన్స్ కమిటీ ఎదుట జరిగిన విచారణలో హెగ్‌సెత్ ఈ నూతన అంచనాలను తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఆ లోపు అయ్యే ఖర్చులను కూడా కలుపుకుని ఈ అంచనాను రూపొందించారు. గతంలో మే, జూన్ నెలల్లో ఈ వ్యయం సుమారు 29 నుంచి 30 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా వేయగా, ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. యుద్ధ కార్యకలాపాల కోసం సుమారు 67 బిలియన్ డాలర్ల అదనపు రక్షణ నిధులను కేటాయించాలని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కెయిన్‌తో కలిసి హెగ్‌సెత్ సెనేట్‌ను అభ్యర్థించారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివర్లో అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో మొదలైన ఈ ఘర్షణ, ఈ నెల ప్రారంభంలో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ విఫలం కావడంతో మళ్లీ తీవ్రరూపం దాల్చింది. ప్రస్తుతం ఇరు పక్షాల మధ్య ప్రతిరోజూ దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టును బలహీనపరిచే లక్ష్యంగా అమెరికా దాడులు సాగుతున్నాయి. ఈ జలసంధిలో ఏర్పడిన అంతరాయాలు అమెరికాలో గ్యాస్ ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఈ ఘర్షణలో ఇప్పటివరకు 17 నుంచి 18 మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయారని, వంద మందికి పైగా గాయపడ్డారని పెంటగాన్ వెల్లడించింది. గాయపడిన వారిలో చాలామంది



తిరిగి విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. అయితే, యుద్ధ వ్యూహం, కాలపరిమితిపై స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఇరు పార్టీల చట్టసభ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ యుద్ధం వల్ల కలుగుతున్న ఆర్థిక, మానవ నష్టాన్ని డెమొక్రాట్లు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. కాంగ్రెస్‌లో రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ మాత్రమే ఉండటంతో, నిధుల కేటాయింపు బిల్లు ఆమోదం పొందాలంటే ఉభయపక్షాల మద్దతు తప్పనిసరి. మరోవైపు ఈ విచారణ జరుగుతున్న సమయంలోనే కొందరు నిరసనకారులు సభకు అంతరాయం కలిగించి యుద్ధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని గణనీయంగా దెబ్బతీశామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అధ్యక్షుడు ట్రంప్ మరిన్ని దాడులకు సంకేతాలు ఇస్తుండటం గమనార్హం. మరో వైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినట్లుగానే ఇరాన్ పై .. యూఎస్ ఆర్మీ దాడులు ముమ్మరం చేసింది. ఇరాన్ లోని కీలక టార్గెట్లపై అమెరికా విరుచుకుపడింది. అగ్రరాజ్యం దాడులతో ఇరాన్ దద్దరిల్లింది. జోర్డాన్‌లోని తమ స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ చేసిన దాడికి ప్రతిగా ఈ శక్తిమంతమైన దాడులు జరుగుతున్నాయని యూఎస్ మిలిటరీ వెల్లడించింది. మరోవైపు.. జోర్డాన్‌లోని బేస్‌లపై దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా పరిగణించారు. “మేం వారిని గట్టిగా దెబ్బకొడతాం” అని ప్రకటించారు. ఆ క్రమంలోనే దక్షిణ ఇరాన్ లో శక్తిమంతమైన పేలుళ్లు వినిపిస్తున్నాయి. ఖేష్మ్ ద్వీపాన్ని, అణువిద్యుత్ కేంద్రం ఉన్న తీరనగరం బుషెహర్‌ను అమెరికా సైన్యం టార్గెట్ చేసింది. ఖేష్మ్ ద్వీపంలో నివాస ప్రాంతాలపై క్షిపణి దాడి జరిగిందని ఇరాన్ స్థానిక మీడియా వెల్లడించింది. జోర్డాన్‌లోని ఎయిర్‌బేస్, కమాండ్ సెంటర్‌ను టార్గెట్ చేశామని ఐఆర్‌జీసీ వెల్లడించింది. అమెరికా బెదిరింపులు కొనసాగినంత కాలం.. ఇరాన్ వైపు నుంచి ప్రతిఘటన ఉంటుందని హెచ్చరించింది. అయితే ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను తాము అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. తాము డజన్ల కొద్దీ ఇరాన్ లక్ష్యాలపై దాడులు చేసినట్లు పేర్కొంది. ఇరాన్, గల్ఫ్ దేశాలకే పరిమితమైన యుద్ధం బుధవారం మరో టర్న్ తీసుకుంది. ఈజిప్ట్‌లోని డమియెట్టా పోర్ట్‌లోని అమెరికాకు చెందిన గ్యాస్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి చేసింది.

# ఈసారి ‘ఆల్ఫా’ వంతు!

జంతర్ మంతర్ వేదికగా జెన్ జీ తరం సృష్టించిన పెను సంచలనం గురించి అందరూ ఇంకా చర్చించుకుంటుండగానే... తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ ఆల్ఫా తరం కూడా తరగతి గదుల్లోంచి బయటికొచ్చింది. ఉత్తరాదిన ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్‌లతో పాటు మహారాష్ట్రలో సైతం పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, బెంచీలవంటి కనీస సదుపాయాలు కల్పించాలనీ, అన్ని పాఠ్యాంశాలకూ టీచర్లను నియమించా లనీ కోరుతూ సాగుతున్న ధర్నాల వెనక కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సాధించిన విజయాల స్ఫూర్తి ఉన్నదని తెలుస్తూనే ఉంది.

పాలకుల్ని నిలదీసిన జెన్ జీ తరాన్ని చూసి అసహ్యించుకున్న ఎంపీ కంగనా రనౌత్ లాంటివారు ఈ ఆల్ఫా తరానికి ఎలాంటి శాపనార్థాలు పెడతారో చూడాల్సివుంది. బిహార్‌లోని గయ జిల్లాలో విద్యార్థులు అతి పెద్ద ధర్నా నిర్వహించడమే కాదు... తమ డిమాండ్లు తెలుసుకోవటానికొచ్చిన ప్రభుత్వాధికారిని వెనక్కిపంపారు. తాము జిల్లా మేజిస్ట్రేట్ (కలెక్టర్)తో తప్ప మాట్లాడబోమని చెప్పటంతో ఆయనే రావాల్సివచ్చింది. అన్నిచోట్లా ఒకే రకమైన సమస్యలు. అందరిదీ ఒకే రకమైన కథ. చదువు చుట్టూ ఇన్ని సమస్యలుండగా ‘వికసిత్ భారత్’ ఎలా సాధ్యమో పాలకులు చెప్పాలి. దేశంలో ప్రాథమిక విద్య మొదలు విశ్వవిద్యాలయ విద్యవరకూ అంతా అస్తవ్యస్థంగా ఉంది. ఎక్కడ చూసినా శిథిలాలను తలపించే బడులు, అరకొర సదుపా యాలు వెక్కిరిస్తుంటాయి. సరిపడా ఉపాధ్యాయులుండరు. యాదృచ్ఛికంగానే కావొచ్చు గానీ... రాజ్యసభలో గురువారం పాఠశాల విద్య గురించి అడిగిన ప్రశ్నకు విద్యామంత్రిత్వ శాఖ ఇచ్చిన జవాబు దిగ్భ్రమ గొలుపుతుంది. దేశంలో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య 1,00,843 అని ఆ శాఖ సహాయమంత్రి చెప్పారు. అందులో 16,357 పాఠశాలలతో ఆంధ్రప్రదేశ్ తొలి స్థానంలో ఉంటే జార్ఖండ్(9,827), మహారాష్ట్ర(9,269), కర్ణాటక(8,042), ఉత్తరప్రదేశ్(7,874) తదనంతర స్థానాల్లో ఉన్నాయి.



అలాగని మిగిలిన స్కూళ్లు బాగున్నాయని కాదు. రాజస్థాన్‌లోని ఒక పాఠశాలలో కేవలం చరిత్ర, హిందీ పాఠ్యాంశాలకు మాత్రమే టీచర్లున్నారు. మరో పాఠశాలలో 1,2,3 తరగతులకు అసలు టీచర్లే లేరు. తక్షణం టీచర్ల నియామకం జరగకుంటే పాఠశాలకు తాళాలేసి, రహదారి దిగ్బంధిస్తామని పిల్లలు హెచ్చరించారు. చివరకు అప్పటికప్పుడు నలుగుర్ని నియమిస్తూ అధికారులు ఉత్తర్వులిచ్చారు. మరో ముగ్గుర్ని పది రోజుల్లో నియమిస్తామనటంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఫతేపూర్‌లో లిఖితపూర్వక హామీ దొరికేవరకూ ఇంటర్ విద్యార్థులు ధర్నా కొనసాగించారు.

సెకండరీ విద్యలో 2023--24లో ఆడపిల్లల్లో 12.6 శాతంగా ఉన్న డ్రాపౌట్లు 2025--26కు 8 శాతానికి తగ్గాయని పార్లమెంటుకు సమర్పించిన నివేదిక చెబుతోంది. కానీ ఇప్పటికీ 8 శాతంమంది పిల్లలు ఆ స్థాయికొచ్చాక చదువులు మానుకుంటున్నారంటే ఆవేదన కలుగుతుంది. దీన్ని అంకెల్లోకి మారిస్తే లక్షల్లో ఉంటుంది. ఇది మన అధ్వాన్న స్థితికి అద్దం పడుతుంది. పేదరికం మొదలుకొని పాఠశాలలో సదుపాయాల లేమి వరకూ ఇందుకు ఎన్నో కారణాలుండొచ్చు. వాటిని సరిచేయటానికి పూనుకొనే వరకూ ఇలాంటి పిల్లలు చదువులకు దూరంకాక తప్పదని పాలకులు గుర్తించాల్సి ఉంది.

ఆంధ్రప్రదేశ్ బడి పిల్లల వ్యథ మరో రకం. అక్కడ గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 11,700 కోట్లు వ్యయం చేసి ‘నాడు--నేడు’ కింద 38,059 పాఠశాలల రూపురేఖల్ని మార్చింది. కార్పొరేట్ విద్యాసంస్థల్ని తలదన్నేలా 60,000 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, 10,000 స్మార్ట్ టీవీలు అమర్చి తరగతి గదుల్ని డిజిటల్ లెర్నింగ్ స్పేస్‌లుగా మార్చింది. పిల్లలకు దాదాపు ఆరు లక్షల ట్యాబ్‌ల్ని అందించి పాఠాల్ని సులభంగా అవగాహన చేసుకునేందుకు తోడ్పడింది.

ఇప్పుడు ఉత్తరాదిన వినబడుతున్న డిమాండ్లతోపాటు మరెన్నో నాలుగేళ్ల క్రితమే అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు అందులో చాలా భాగం అటకెక్కాయి. గుక్కెడు మంచినీళ్లు, పరిశుభ్రమైన పరిసరాలు, రుచికరమైన మధ్యాహ్న భోజనం కరువయ్యాయి. గతంలో సకల సదుపాయాలతో వర్థిల్లిన బడులన్నీ ఇప్పుడు బావురుమంటున్నాయి. అనేకం మూతబడ్డాయి. అందుకే ఉత్తరాది పిల్లల స్ఫూర్తితో రేపో మాపో ఏపీ ఆల్ఫా తరం కూడా తిరగబడినా ఆశ్చర్యం లేదు.

# మళ్లీ కావేరీ వివాదం

ఎంతో సున్నితమైన నదీజలాల సమస్యను ప్రభుత్వాలు దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా వదిలేయటంవల్ల అది కాస్తా మరింత జటిలమవుతోంది. రాష్ట్రాలమధ్యా, రాష్ట్రాల్లో ప్రాంతాలమధ్యా తరచు తలెత్తుతున్న జలవివాదాలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. ఎప్పటిలాగే కర్ణాటక, తమిళనాడుల మధ్య తాజాగా కావేరీ నదీజలాల పంపకం విష యంలో చిచ్చు రేగింది. రోజూ 3,500 క్యూసెక్కుల చొప్పున తమిళనాడుకు 4.5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కావేరీ నీటి యాజమాన్య ప్రాధికార సంస్థ (సీడబ్ల్యూఎంఏ) కర్ణాటకకు ఇటీవల ఇచ్చిన ఆదేశాలు తాజా వివాదానికి మూలం. ఈ విషయంలో ఏం చేయాలన్న అంశంపై ఈ ఆదివారం కర్ణాటక ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావాలనుకుంటున్న బీజేపీ ఈ సమస్యపై అప్పుడే ఉద్యమం కూడా ప్రారంభించింది. కన్నడ సంఘాలు వచ్చే 13న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ విషయంలో చర్చించేందుకు తమ రాష్ట్రానికి సోమవారం రావాల్సిన తమిళనాడు సీఎం విజయ్‌ను ‘ప్రస్తుత పరిస్థితుల రీత్యా’ వాయిదా వేసుకోవాలని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అభ్యర్థించారు. రాజ్యాంగంలోని 262వ అధికరణం నదీజలాల వినియోగం, పంపిణీ, నియంత్రణ వంటి అంశాల్లో రాష్ట్రాల మధ్య వివాదాలు రాజుకున్నప్పుడూ, ఫిర్యాదులొచ్చినప్పుడూ వాటి పరిష్కారం కోసం తగిన యంత్రాంగాన్ని ఏర్పాటుచేసే అధికారాన్ని పార్లమెంటుకు ఇచ్చింది. దీని ఆధారంగానే కేంద్రం 1956లో నదీజలాల వివాదాల చట్టాన్ని, నదీజలాల బోర్డు చట్టాన్ని తీసుకొచ్చింది. బోర్డు అయితే ఏర్పాటు కాలేదుగానీ... నదీ వివాదాల చట్టంకింద అయిదు ట్రిబ్యునల్స్ ఏర్పడ్డాయి. చిత్రమేమంటే ప్రజా ప్రభు త్వాలు లేని కాలంలోనే... అంటే బ్రిటిష్ వలసపాలకుల హయాంలోనే నదీజలాల ఒప్పందాలు కుదిరాయి. 1924లో అప్పటి మైసూర్ సంస్థానం, మద్రాస్ ప్రెసిడెన్సీలమధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం మైసూర్ కృష్ణరాజ సాగర్ డ్యామ్‌నూ, మద్రాస్ మెట్టూర్ డ్యామ్‌నూ నిర్మించుకోవటానికి అవగాహన కుదిరింది. అప్పట్లో కావేరీ జలాల్లో దాదాపు 75 శాతం వాటా మద్రాస్ ప్రెసిడెన్సీకే కేటాయించారు. ఈ ఒప్పందం కాలపరిమితి యాభైయేళ్ల అనంతరం 1974లో ముగిసిపోగా అప్పటికే కర్ణాటకలో



నదీజలాల కేటాయింపు విషయంలో తమకు అన్యాయం జరిగిందనే భావన బలంగా నాటుకుంది. ఎగువభాగంలో ఉండటం కారణంగా కర్ణాటక తమ నీటి అవసరాలకు తగ్గట్టు కొత్త ప్రాజెక్టుల నిర్మాణం కూడా చేపట్టింది. వర్షాలు సమృద్ధిగా పడినంతకాలం నదీ జలాల వివాదాలు వచ్చే అవకాశం లేదు. రుతుపవనాలు విఫలమై వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా, కరవు కాటేసినా ఘర్షణలు బయల్దేరతాయి. కావేరీ బేసిన్‌లోని ఆనకట్టలు నిండనప్పుడు తాము బెంగళూరు నగరానికీ, రైతులకూ అవసరమైన నీరు వినియోగించుకోవటంలో తప్పేమిటన్నది కర్ణాటక ప్రశ్న. ఇటు తమవైపు పంటలన్నీ ఎండిపోతున్నాయనీ, న్యాయంగా తమ వాటా నీరు విడుదల చేయాలనీ తమిళనాడు అంటున్నది. అసలే ఈ ఏడాది ‘సూపర్ ఎల్‌నినో’ ప్రభావంతో వర్షాలు సరిగా లేవు. ఇలాంటి పరిస్థితుల్లో సహజంగానే వివాదాలు తలెత్తుతాయి. పుదుచ్చేరి కూడా ఈ కావేరీ జలాల వివాదంలో ఉంటుంది. పడమటి కనుమల్లో పుట్టి గోవా దగ్గర అరేబియా సముద్రంలో కలిసే మహాదాయి విషయంలోనూ కర్ణాటక, గోవాల మధ్య ఇలాంటి వివాదాలే తలెత్తుతుంటాయి. ప్రపంచ పునరుత్పాదక జలవనరుల్లో మన దేశం వాటా కేవలం 4 శాతం మాత్రమే. కనుక నీటి కోసం పోటీ తప్పదు. సమస్య తలెత్తినప్పుడల్లా తాత్కాలిక పరిష్కారంతో ప్రయత్నించి, గండం గడించిందనుకోవటం తప్ప శాశ్వత పరిష్కార దిశగా ఎవరూ ఆలోచించటం లేదు. ఘర్షణ పడే రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరిద్దామనుకోవటం లేదు. విపక్షాలనుంచి ఒత్తిళ్లు తప్పవు మరి. నదుల్లో నీరు నిండుకున్న ప్పుడు నీరందక పంటలు ఎండిపోతాయి. దృఢంగా పోరాడి ఆ నష్టాన్ని తగ్గించుకోవటంపైనే వివాదం తలెత్తిన రాష్ట్రాల రైతులు దృష్టి పెడతారు. కావేరీ వివాదం సామరస్య పూర్వకంగా పరిష్కారమయ్యే దిశగా రెండు రాష్ట్రాలూ చిత్తశుద్ధితో కృషిచేయాలి. ఇప్పుడిప్పుడే వరుణుడు కరుణిస్తున్న దాఖలా కనబడుతోంది. కనుక ఈ వివాదం త్వరలో సమసిపోతుందని ఆశించాలి.

# మూగబోయిన ఫైర్ బ్రాండ్స్

2024 ఎన్నికల ఓటమి అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయం ఊహించని మలుపు తిరిగింది. గతంలో ప్రత్యర్థిపార్టీల నేతలపై నిమిషానికో రీతిలో విరుచుకుపడే ఫైర్ బ్రాండ్ నాయకులు ఆర్.కే. రోజా, కొడాలి నాని, జోగి రమేష్, వల్లభనేని వంశీ వంటి కీలక నేతలు రాజకీయంగా పూర్తిగా మౌనం వహించారు. ఎన్నికలు ముగిసి రెండేళ్లు దాటిపోయినా వీరు పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనకపోవడం, మీడియా ముందుకు రాకపోవడం కేడర్‌లో తీవ్ర నిరాశను నింపుతోంది. ప్రస్తుతం కేవలం పేర్ని నాని, అంబటి రాంబాబు వంటి కొద్దిమంది నాయకులు మాత్రమే మైకుల ముందుకు వచ్చి ప్రత్యర్థులపై ఎదురుదాడి చేస్తున్నారు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నమోదైన వరుస కేసులు, చట్టపరమైన చర్యల భయంతో స్లో అయ్యారు. జోగి రమేష్ పై సిఐడి కేసులు, అగ్రిగోల్డ్ భూ వివాదం, తాజాగా కుటుంబం కేసులు కూడా వచ్చి పడ్డాయి. అలాగే వల్లభనేని వంశీ చాలా రోజులు జైల్లో ఉండి వచ్చారు. కొడాలి నాని అనారోగ్యం, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అసలు గుడివాడలోనే కనిపించడంలేదు. ఐదేళ్ల పాలనలో వ్యక్తిగత దూషణలతో తీవ్ర స్థాయి విమర్శలు చేసిన ఈ నేతలు, ఇప్పుడు అధికార పక్షం కఠినంగా వ్యవహరిస్తుండటంతో చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకునేందుకు తాత్కాలికంగా రక్షణాత్మక వైఖరి లోకి వెళ్లిపోయారనేది స్పష్టమవుతోంది.

# ఇంటి పైనుంచి విద్యుత్ తీగలు

**ఫిర్యాదు చేసిన పత్తాలేని, మొద్దు నిద్రలో విద్యుత్ అధికారులు**

**మన తొలివెలుగు మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (31-07-2026) :** చేతికి అందే ఎత్తులో ఉన్న కరెంట్ తీగలు, ఇళ్ల పై నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్ల వల్ల ప్రజలు ప్రాణభయంతో వణికిపోతున్నట్లు, ఫిర్యాదులు చేసిన అధికారులు స్పందించడం లేదని, మరి అధికారులు ఉన్నట్టా.. లేనట్టా.. అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా, కందుకూర్ మండలం, దావూద్‌గూడ గ్రామంలో పలువురు గ్రామస్తుల ఇళ్లపై నుంచి అధిక వోల్టేజ్ విద్యుత్ తీగలు వెళ్లడంతో ఎప్పటికప్పుడు ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇంటి పైనుంచి వెళ్తున్న విద్యుత్తు తీగలకు ఇంటికి ఆనకుండా కట్టెలను అడ్డుపెట్టారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ఈ తీగలు తెగి ఇళ్లపై పడటం లేదా షాక్ కొట్టడం వల్ల ప్రమాదమో, ప్రాణనష్టమో జరిగిన తర్వాత అధికారులు పరామర్శకు వస్తారా అని అధికారులు తీరుపై మండిపడుతున్నారు. ఈ సమస్యను గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలతో కలిసి సుమారు 8 నెలల క్రితమే కందుకూరు మండల కేంద్రంలో డి ఈ, ఏఈ ల దృష్టికి తీసుకువచ్చి, విద్యుత్ తీగలను మార్పు చేయాలని పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. అయితే, ఇప్పటి వరకు విద్యుత్ శాఖ నుంచి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమని గ్రామస్తులు తెలుపుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రమాదం మరింత పెరిగి, గ్రామస్తుల ప్రాణాలు, ఆస్తులకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని దావూద్‌గూడ గ్రామంలో ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను అత్యవసరంగా పరిశీలించి, వెంటనే మార్పు చేయాలని కోరుతున్నారు





**ఇంటి పైనుంచి పోతున్న విద్యుత్ తీగలు పొంచి ఉన్న ప్రమాదం**

**దావూద్‌గూడ గ్రామ ఉపసర్పంచ్ ఆర్ తేజ నాయక్**

నివాసాల సమీపంలో విద్యుత్ తీగలు ఇంటి పైకప్పు, గోడలకు అత్యంత దగ్గరగా వేలాడుతున్నాయని, ఈ విషయంపై పలుమార్లు గ్రామస్తులతో కలిసి విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తీగలు మరింత దిగువకు జారిపడి ఇంటిని తాకే పరిస్థితి నెలకొన్నది. ఇంటి పైకి వెళ్లి చిన్నారులు ఆడుకుంటున్న సమయంలో ఒకవేళ షార్ట్ సర్క్యూట్ జరిగి ప్రమాదం సంభవిస్తే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు అని ప్రశ్నించారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవాలని కోరారు.

## పురోహిత అర్చక రత్న బిరుదుతో ఏల రాము రామానుజాచార్యకు ఘన సత్కారం

**చింతల్ పురోహితునికి అరుదైన పురస్కారం**







**మన తొలివెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి రమేష్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని చింతల్ పురోహితునికి అరుదైన పురోహిత అర్చక రత్న బిరుదుతో ఏల రాము రామానుజాచార్యకు ఘన సత్కారం లభించింది. అఖిల భారత పద్మ బ్రాహ్మణ సంఘం 28వ వార్షికోత్సవ వేడుకలు ఇటీవల తమిళనాడు లోని శ్రీరంగంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగద్గిరి గుట్ట చింతల్ ద్వారకానగర్కు చెందిన ప్రముఖ పురోహితుడు ఏల. రాము రామానుజాచార్యకు ఆయన అందిస్తున్న విశిష్టమైన పౌరోహిత్య, ఆధ్యాత్మిక సేవలను గుర్తించి పురోహిత అర్చక రత్న బిరుదుతో సత్కరిం చి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా హాజరైన అఖిల భారత పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం జాతీయ అధ్యక్షులు గుర్రం బొజ్జయ్య శాస్త్రి, తెలంగాణ రాష్ట్ర అధ్య క్షులు రుద్ర పాండు శాస్త్రి, ప్రముఖ పండితులు సీత వంశీ భట్టాచా ర్యులు మాట్లాడుతూ రాము రామానుజాచార్యులు ఎన్నో సంవత్సరా లుగా పౌరోహిత్య రంగంలో విశేష సేవలు అందిస్తూ ధార్మిక విలువ లను సమాజంలో పెంపొందించేందుకు చేస్తున్న కృషి అభినందనీ యమని కొనియాడారు. ఈ అరుదైన గౌరవం లభించడం పట్ల కుటుంబ సభ్యులు, శిష్యులు, భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ రాము రామానుజాచార్యులకు అభినందనలు తెలిపారు.

## ఓటు హక్కు ప్రజాస్వామ్యం ప్రసాదించిన అత్యంత విలువైన హక్కు



**మన తొలివెలుగు , మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య** ఓటు హక్కు ప్రజాస్వామ్యం ప్రసాదించిన అత్యంత విలువైన హక్కు అని ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలని టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్ రెడ్డి, మహేశ్వరం మండలం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సి.హెచ్. యాదయ్య తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రశాంతి హిల్స్ లో వారు ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఓటు నమోదు ప్రక్రియ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యం ప్రసాదించిన అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి సంతకం చేసి బీ.ఎల్. ఓలకు అంద చేయాలని కోరారు. ఫారం సమర్పించిన వారి పేర్లు ముసాయిదా, అనంతరం తుది ఓటరు జాబితాలో ఉంటాయని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుకు రావాలని వారు కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే బీఎల్ ఓలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఏలు, కాంగ్రెస్ కార్యకర్తలు, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్ పీ.ఏలు హనుమంతరావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు




**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య** ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని అర్హులైన ప్రతి ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగి పోకుండా ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియలో పాల్గొనాలని కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, పీసీసీ కార్యదర్శి యేల్మేటి అమరేందర్ రెడ్డి సూచించారు. జీహెచ్ఎంసీ పరిధి బాలాపూర్ డివిజన్(62) మల్లాపూర్ , జిల్లెలగుడా, మీర్ పేట్, ప్రశాంత్ హిల్స్ , బడంగ్ పేట్ లలో ఎస్ ఐ ఆర్ పైన బీ.ఎల్.ఓ, బీ.ఎల్.ఏలతో సమావేశం నిర్వహించారు. ఆగస్ట్ 3 వరకు ఓట్ల సంగ్రామం ఎస్ ఐ ఆర్ లో తప్పకుండా పని చేయాలని, తప్పకుండా తమ తమ బూతులలో ఇంటి పెద్ద ఫోన్ నంబర్, ట్రాన్స్‌ఫర్ అయిన ఓట్ల వివరాలు, చనిపోయిన వారి డేటాను కచ్చితంగా తీసుకోవాలని బీ ఎల్ ఓ, బీ ఎల్ ఓ లకు తెలియజేశారు. అలాగే ఇంకా 3 రోజుల సమయం ఉంది కాబట్టి బీ.ఎల్.ఏ లు మరింత ఉదృతంగా తిరిగి ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకొని వారికి అందజేసి ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాంని మరింత పర్సంటేజ్ పెంచాలని అమరేందర్ రెడ్డి చెప్పారు. ప్రజలు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 3 వరకే సమయం ఉన్నందున ఎన్యూమరేషన్ ఫారాలను నింపని వారు త్వరగా నింపి బీ.ఎల్. ఓలకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ క్యారగారి శ్రీధర్, డివిజన్ అధ్యక్షులు చల్లా బాల్ రెడ్డి , సిద్దాల శ్రీశైలం, బంగారు అశోక్, సామిడి గోపాల్ రెడ్డి,మాజీ కార్పోరేటర్లు బాలు నాయక్, చిక్కుల శివప్రసాద్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ రావుల లింగం, బీఎల్ ఏ లు వంగేటి మధుసూదన్ రెడ్డి, గుండోజి వెంకట్ చారి, కొండ శ్రీధర్ రెడ్డి, గుండ్ల కొమరయ్య, చింతపట్ల పవన్, రాజు నాయక్, గిరి నాయక్, వరికుప్పల సురేష్,యువ నాయకులు రాఘవేంద్ర, నితీష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళీ ఆలయంలో నగర సీపీ వీసి సజ్జనార్ చేతుల మీదిగా ఘనంగా ధ్వజారోహణ





**పూర్ణకుంభంతో ఘన స్వాగతం**

**ఆషాఢ బోనాలకు శుభారంభం**

**మన తొలివెలుగు చాంద్రాయణగుట్ట ప్రతినిధి శైలేష్ కుమార్ (31- జూలై 2026) :** ఆషాఢ మాస బోనాల ఉత్సవాలకు శు భ ఆరంభంగా లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళీ దేవాలయంలో శుక్రవారం ధ్వజారోహణ, కలశప్రతిష్ఠ పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నగర సీపీ వీసీ సజ్జనార్ కి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో, మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతిం పలికారు. పాతబస్తీలో చారిత్రాత్మక నేపథ్యం కలిగిన లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళీ బోనాల ఉత్సవాలను ప్రారంభించిన నగర పోలీస్ కమిషనర్ వీసి సజ్జనార్, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, డీసీపీ ఖారే కిరణ్ భాస్కర్ ల చేతుల మీదిగా వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆలయ శిఖరంపై సీపీ సజ్జనార్ ధ్వజాన్ని ఎగురవేశారు. అనంతరం సింహవాహిని అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించారు . 118వ వార్షిక బోనాల నవరాత్రి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ ప్రారంభం ధ్వజారోహణ బోనాల ఉత్సవాలు అధికారికంగా ప్రారంభమైనట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. బోనాలు తెలంగాణ సంస్కృతికి గుర్తింపని, శాంతియుతంగా, క్రమశిక్షణతో ఉత్సవాలు జరుపుకోవాలని, ఆలయ ఘనమైన చరిత్రను గుర్తు చేస్తూ.. గత 120 సంవత్సరాలుగా ఆషాఢ మాసంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోందని వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం అని కమిషనర్ చెప్పుకొచ్చారు. పటిష్ట భద్రత భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 100 పైగా సిసి కెమెరాలతో 24/7 నిఘా, డ్రోన్ నిఘా, పటిష్ట పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు, మహిళా పోలీసులతో ప్రత్యేక క్యూ లైన్లు. తాగునీరు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ ఏర్పాట్లు చేస్తున్నట్టు సీపీ సజ్జనార్ తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు బోనాల సందర్భంగా, డప్పు నృత్యాలతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. రాబోయే కార్యక్రమాలు ఈ నెలలో ఘటాల ఊరేగింపు, తోటల బోనాలు, రంగం భవిష్యవాణి, లక్షకుంభ కుంకుమార్చన వంటి కార్యక్రమాలు వైభవంగా జరగనున్నాయని లాల్ దర్వాజా బోనాలు తెలంగాణ సంస్కృతికి, ఐక్యతకు ప్రతీక. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద జానపద ఉత్సవం, శాంతియుతంగా, క్రమశిక్షణతో ఉత్సవాలు జరుపుకోవాలి. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నానని ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. మహిళలు, పిల్లల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం సమన్వయం పోలీస్, జిహెచ్ఎంసి, ఆలయ కమిటీ సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి జోనల్ కమిషనర్ సత్యనారాయణ, ఎండోమెంట్స్ డిపార్ట్మెంట్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస రావు, ఛత్రినాక డివిజన్ ఏసీపీ సిహెచ్ చంద్రశేఖర్, చార్మినార్ జోన్ ట్రాఫిక్ ఏసిపి కే లక్ష్మణ్, ఛత్రినాక ఇన్స్పెక్టర్ కోటేశ్వర్ రావు , శాలిబండ ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్, మొఘల్ పూర ఇన్స్పెక్టర్ సి శ్రీను, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎస్ సంతోషం, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు వెంకటేష్, జె. లక్ష్మీనారాయణ గౌడ్, కే. వెంకటేష్, ఎ. మాణిక్ ప్రభు గౌడ్, బంగ్లా రాజు, జి.రాజ్కుమార్ యాదవ్, సీర రాజ్కుమార్, కె.విష్ణు గౌడ్, బాల్వంయాదవ్, తిరుపతి నర్సింగ్ రావు, ఆలయ ట్రస్టీ ప్రధాన కార్యదర్శి జి. అరవింద్ కుమార్ గౌడ్, ఆలయ కమిటీ ప్రతినిధులు ఎ.చంద్రకుమార్, ఎ.వినోద్ కుమార్, శేషనారాయణ, విఠల్, రవికుమార్, పోలీస్, జిహెచ్ఎంసీ, అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

## తులం బంగారం హామీని వెంటనే అమలు చేయాలి

**మన తొలివెలుగు భువనగిరి రూరల్ ప్రతినిధి కే. నాగమణి (31 జూలై 2026) :** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి రాకముందు మహిళలకు వివాహ సందర్భంగా కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత డిమాండ్ చేశారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన భారత జాతీయ మహిళా సమాఖ్య మండల 3 మహాసభ సందర్భంగా ఏర్పాటు చేసిన సంఘం జెండాను జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మహిళలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా తులం బంగారం హామీ ఇప్పటికీ అమలు కాకపోవడంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన మహిళలు, యువతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరచిపోవడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ ద్వారా వేలాది మంది మహిళలు ప్రజాప్రతినిధులుగా ఎదిగారని, అదే విధంగా పార్లమెంట్, శాసనసభల్లో కూడా మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా 33 శాతం రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మహిళలపై పెరుగుతున్న హింస, వివక్ష, అసమానతలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మహిళలకు విద్య, ఉపాధి, ఆరోగ్యం, భద్రత, సమాన వేతనం వంటి హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల రాజకీయ, సామాజిక, ఆర్థిక హక్కుల సాధన కోసం భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో విస్తృత ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఆలస్యం కొనసాగితే భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ముంతాజ్ బేగం అధ్యక్షతన జరిగిన మహాసభలో దొంతి నిర్మల, బీరకాయల లక్ష్మమ్మ, జిన్నా రాజమణి, ఆడెపు శోభ, చాట్ల శారద, ఇట్టేబోయిన అరుణ, పరుశ పుష్ప, ఇట్టేబోయిన లలిత, అండాలు, వాణి, కృష్ణ వేణి, తదితరులు పాల్గొన్నారు.






## భారతికి కిలక బాధ్యతలు

**కడప :** వైసీపీలో అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్ర ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఆయన నాయకత్వమే ప్రధాన బలంగా నిలిచింది. పార్టీ విజయాలు, పరాజయాలు, రాజకీయ నిర్ణయాలు అన్నీ కూడా జగన్ చుట్టూనే తిరిగాయి. అయితే మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పార్టీ నిర్వహణలో మరో కీలక నాయకత్వం అవసరమనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.గతంలో విజయసాయిరెడ్డి పార్టీ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారని భావించేవారు. ఆయన పార్టీకి దూరమైన తర్వాత ఆ బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డి సమన్వయం చేస్తున్నారని ప్రచారం ఉన్నప్పటికీ, పార్టీ అంతర్గత వ్యవహారాల్లో ఇంకా మార్పులు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నేతలు కోటరీ రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది.ఈ పరిస్థితుల్లో భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జగన్ కొత్త వ్యూహం సిద్ధం చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రానున్న సంవత్సరాల్లో ఆయన ప్రజల మధ్య ఎక్కువ సమయం గడపాలని, రాష్ట్రవ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేపట్టాలని భావిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అలాంటి సమయంలో పార్టీ రోజువారీ వ్యవహారాలను చూసుకునే నమ్మకమైన నాయకత్వం అవసరమని ఆయన భావిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. జగన్ సతీమణి వైఎస్ భారతి పేరు ఎక్కువగా వినిపిస్తోంది. కుటుంబ సభ్యురాలు కావడం, సంస్థాగత వ్యవహారాలపై అవగాహన ఉండడం, నాయకత్వంపై పూర్తి విశ్వాసం ఉండడం వంటి కారణాలతో ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇతర నేతలకు అలాంటి బాధ్యతలు ఇస్తే అంతర్గత విభేదాలు వచ్చే అవకాశం ఉంటుందని కొందరు అభిప్రాయపడుతుండగా, భారతి అయితే అందరినీ సమన్వయం చేయగలరని కూడా అంటున్నారు.ఇప్పటి వరకు భారతి ప్రత్యక్ష రాజకీయాల్లో పెద్దగా చురుకుగా కనిపించలేదు. అయితే ఎన్నికల సమయంలో పులివెందుల ప్రాంతంలో జగన్ తరఫున ప్రచారం నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. అలాగే వ్యాపార, సంస్థాగత అంశాల నిర్వహణలో ఆమెకు అనుభవం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అనుభవం పార్టీ నిర్వహణలో కూడా ఉపయోగపడుతుందని కొందరు విశ్లేషిస్తున్నారు.రానున్న సాధారణ ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానం నుంచి భారతిని పోటీ చేయించే అవకాశాన్ని జగన్ పరిశీలిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వైఎస్ అవినాష్ రెడ్డి ఇప్పటికే వరుస విజయాలు నమోదు చేశారు. అయితే భవిష్యత్తులో భారతిని బరిలోకి దింపితే ఆ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాలపై కూడా పార్టీకి మరింత బలం చేకూరుతుందనే అంచనాలు కొందరు వ్యక్తం చేస్తున్నారు.అయితే ఇవన్నీ ఇప్పటికైతే అధికారికంగా ధృవీకరించబడిన విషయాలు కావు. పార్టీ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. అందువల్ల భారతి పార్టీ కీలక బాధ్యతలు చేపడతారా, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారా అన్నది రాబోయే రోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం మాత్రం ఈ ప్రచారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

## పేపర్ మిల్లు ఎన్నకల్లో జనసేన ఫ్రంట్ విజయం

**రాజమండ్రి :** రాజమండ్రి ఆంధ్ర పేపర్ మిల్లు కార్మిక సంఘాల ఎన్నికల్లో జనసేన ఫ్రంట్ ఘన విజయం సాధించింది. వైసీపీ, టీడీపీ కూడా పోటీ చేసిన ఈ త్రిముఖ పోరులో జనసేన, ఏఐటీయూసీ, ఎఫ్ఐటీయూ యూనైటెడ్ ఫ్రంట్ 258 ఓట్లతో గెలుపొందింది. వైఎస్సార్ సీపీకి 228 ఓట్లు రాగా, టీడీపీకి చెందిన టీఎన్‌టీయూసీ 220 ఓట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఈ ఎన్నికల్లో కూటమి పార్టీలయిన టీడీపీ, జనసేన విడివిడిగా పోటీచేయడం చర్చనీయాంశమైంది.ఓట్ల శాతంలో ఏపీలో మూడో స్థానంలో ఉండే జనసేన పార్టీ ఈసారి సంచలనం సృష్టించింది. కార్మిక సంఘాల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీని వెనక్కి నెట్టి మరీ ఘన విజయం సాధించింది. క్షేత్ర స్థాయిలో జనసేన పార్టీ బలోపేతం అవుతుంది అనడానికి ఇది నిదర్శనమంటూ ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## ఇరవై వేల పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి



**మన తొలివెలుగు యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ (31 జూలై 2026) :** రాష్ట్రంలో పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్‌పై నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నదని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు యం.డి. సలీం, పట్టణ అధ్యక్షులు మద్దేబోయిన సుందరయ్య తెలిపారు. శుక్రవారం భువనగిరి పట్టణం బంజారహిల్స్ కాలనీలో డివైఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ.. తక్షణమే ప్రభుత్వం నోటిఫికేషన్‌ను వెనకి తీసుకోవాలని, కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థులందరికీ నష్టం జరుగకుండా వయోపరిమితిని పెంచాలని డిమాండ్ చేశారు. పూర్తిస్థాయి నోటిఫికేషన్ వేంటనే విడుదల చేయాలని, లేకుంటే డివైఎఫ్ఐ ఆద్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని అనేక మంది యువత ఉద్యోగాలు లేక తీవ్ర మానసిక, ఆర్థికంగ ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన జాబ్ క్యాలండర్ ప్రకారం నోటిఫీకేషన్లు ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. వీరితోపాటు డివైఎఫ్ఐ పట్టణ నాయకులు ఖరీమ్, అమాన్ అలీ, శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే హెచ్-143 నూతన కమిటీ



**మన తొలివెలుగు ఇబ్రహీంపట్నం ప్రతినిధి సీ.హెచ్ రాజు (31 జూలై 2026) :** నియోజకవర్గ టీయూడబ్ల్యూజే హెచ్- 143 ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులుగా సురమోని సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మొలుగు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా మక్కపల్లి శ్రీనివాస్, కోశాధికారి నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, హనుమంతు, సుదర్శన్, సలహాదారుగా పసునూరు వెంకటేష్, సంయుక్త కార్యదర్శి చెరుకూరి మల్లేష్, ప్రచార కార్యదర్శి నల్లోల్ల కిషన్, జిల్లా నాయకులుగా చండీశ్వర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సురమోని బాబు, విజయ్, గోవర్ధన్, రాజు లు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ అల్లం పల్లి సురేష్ , పంది బుగ్గ రాములు , రామచందర్ , బస్వాపురం దశరథ, గోపాల్, సల్వా చారి, మహేందర్, సురేష్, దుర్గేష్, ప్రింట్, ఎలక్ట్రానిక్ పాత్రికేయులు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళీ అమ్మవారి బోనాల ఉత్సవాలకు రావాలని నీలం మధు ముదిరాజ్ కి ఆహ్వానం



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య** ఈనెల 2వ తేదీన ఆదివారం నాడు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలకేంద్రంలో శ్రీ శ్రీ శ్రీ మహంకాళీ అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా మెదక్ కంటెస్టెడ్ ఎంపీ నీలం మధు ముదిరాజ్ ని మహేశ్వరం ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గదగూటి ఎట్టయ్య, ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గదగూటి మహేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు. తెలంగాణలో సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల ఉత్సవాలను మహేశ్వరంలో అంగ రంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తప్పకుండా రావాలని మహేశ్వరం ముదిరాజ్ సంఘం వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకి పరమేష్, గదగూటి శ్రీశైలం, జగన్, మల్లేష్, రాకేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీసులకు ఘన సన్మానం



**మన తొలివెలుగు, ?ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ శాఖలో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ఏ.గోపాల్ ఏఎస్ఐ, చారకొండ పిఎస్, ఎండి. మహమ్మద్ పాషా హెచ్‌సి, ఊరకొండ పిఎస్ లను జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల భద్రత కోసం వీరు అందించిన నిబద్ధతతో కూడిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కుటుంబంతో సంతోషంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి డీఎస్పీ సాయి వెంకట్ రెడ్డి, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, సీసీఎస్ సీఐ శంకర్, ఏఓ కృష్ణయ్య, పోలీస్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు గుణవర్ధన్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాగిభావిలో పౌరహక్కుల దినోత్సవం



**మన తొలివెలుగు మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ (31 జూలై 2026) :** మోత్కూర్ మండలంలోని రాగిభావి గ్రామంలో ఆర్.ఐ ఇంద్రకుమార్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో అన్ని కులాలు సమానమేనని, కుల వివక్షకు తావులేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దళిత కాలనీల్లో 40 ఏళ్ల కిందట నిర్మించుకున్న ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని, గత ప్రభుత్వం పంపిణీ చేసిన మూడెకరాల భూమికి ఉన్న దారి సమస్యను రెవెన్యూ అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే ఆ భూములకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బోర్లు వేయించినా విద్యుత్ లైన్ లేకపోవడంపై జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను ప్రస్తావించారు. జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు డ్రా తీయకపోవడంతో అన్య జరుగుతోందని,కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం దాసరి తిరుమలేష్‌ను, సర్పంచ్‌ను గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీవాణి చంద్రశేఖర్ రెడ్డి, డి.ఇ రామావత్ మంగులాల్, పంచాయతీ రాజ్ ఏ.ఇ దేగవత్ శివ, పంచాయతీ కార్యదర్శి గజ్జి చంద్రశేఖర్, జి.పి.ఓ ప్రవీణ్, ఏ.ఎన్.ఎం పార్వతి, ఆశా వర్కర్ నవ్య, అంగన్‌వాడీ టీచర్ స్వప్న, రేషన్ డీలర్ వెంకటరెడ్డి, వార్డు సభ్యులు ఎలుగు యాదిరెడ్డి, కరుణాకర్, నర్సింగరావు, అన్నపూర్ణ, పూజ ఉపేందర్ మరియు గ్రామస్తులు చంద్రశేఖర్ రెడ్డి, రాంపాక మల్లేష్, బండారి యాదయ్య, చంద్రయ్య, అమృతరెడ్డి, సాలమ్మ, వెంకటమ్మ, స్వాతి, అనూష తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో వ్యక్తి జేబులో నగదు చోరీ

**హైదరాబాద్ :** అపోలో ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన ఓ వ్యక్తి జేబులో నుంచి రూ.46,500 నగదు చోరీకి గురైన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టోలిచౌకి పారామౌంట్ కాలనీకి చెందిన ఉస్మాన్ (45) ఈ నెల 27న అపోలో ఆస్పత్రికి వెళ్లారు. బిల్లింగ్ కౌంటర్ వద్ద వేచి ఉన్న సమయంలో గుర్తుతెలియని మహిళలు అతని జేబులో ఉన్న రూ.46,500 నగదును చాకచక్యంగా అపహరించారు. విషయం గుర్తించిన బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## రంగనాధ్ కు మద్దతుగా రేవంత్

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగర రూపురేఖలను మారుస్తామని.. చెరువులు, ఆక్రమణలను ఉపేక్షించేది లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హైడ్రా ను తెరపైకి తెచ్చింది. అయితే ఇప్పుడిది రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. హైడ్రాను సీఎం రేవంత్ రెడ్డి తన 'బ్రెయిన్ చైల్డ్'గా భావిస్తుంటారు. అందుకే హైడ్రా కమిషనర్‌గా సమర్థుడిగా పేరొందిన ఐపీఎస్ అధికారి రంగనాథ్‌ను నియమించి, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. అయితే, ఇటీవల హైకోర్టు

# ఇంకా తేలని రాష్ట్రాల పంచాయితీ

# పుష్కర కాలమైన బదిలీ కాని ఆస్తులు



**హైదరాబాద్ :** రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లైనా ఇంకా రెండు రాష్ట్రాల మధ్య ప్రభుత్వ భవనాల పంపకాలు పూర్తి కాలేదు. హైదరాబాద్‌లో ఉన్న ప్రభుత్వ భవనాలను ఆంధ్రప్రదేశ్ సర్కా?ర్ ఇంకా తెలంగాణకు అప్పగించలేదు. కొన్ని భవనాలను ఖాళీ చేసినప్పటికీ వాటిని అప్పగించలేదు. మరికొన్ని భవనాల్లో ఏపీ ఉద్యోగులు కొనసాగుతున్నారు. లేక్ వ్యూ గెస్ట్ హౌస్ సహా కీలక ఆస్తుల బదిలీ కూడా పెండింగ్‌లోనే ఉంది. ఆస్తుల విభజన, నదీ జలాల పంపకం వంటి అంశాలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో రెండు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన జరిగి పుష్కర కాలం పూర్తి అయిపోయింది. హైదరాబాద్ నగరం ఉమ్మడి రాజధానిగా 10 ఏళ్ల పాటు కొనసాగింది. ఆ గడువు కూడా తీరిపోయి 2 ఏళ్లు గడిచింది. అయితే ఈ 12 ఏళ్లు పూర్తి అయినా రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజన అంశం ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు. అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ మధ్య పలు సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉంటున్నాయి. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లోని ప్రభుత్వ భవనాల బదిలీ ముందుకు సాగడం లేదు.ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం హైదరాబాద్‌లోని మొత్తం 2,565 ప్రభుత్వ భవనాల్లో 589 భవనాలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. మిగిలిన 1,976 భవనాలను తెలంగాణకు అప్పగించారు. అయితే ఉమ్మడి రాజధాని గడువు ముగిసిన తర్వాత ఈ భవనాలను తెలంగాణకు అప్పగించాలని అప్పుడే తేల్చి చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఆ ప్రక్రియ మాత్రం ప్రారంభం కాలేదు.పాటిగడ్డ, బంజారాహిల్స్, కుందన్‌బాగ్, ఎర్రమంజిల్, సైఫాబాద్, మలక్‌పేట్, ఖలాదేరా, మదన్నపేట వంటి ప్రాంతాల్లో ఉన్న ఈ భవనాలు ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతున్నాయి. తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం.. మొత్తం 589 భవనాల్లో 221 భవనాల్లో ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా.. మరో 368 భవనాలను వారు ఖాళీ చేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వానికి మాత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా అప్పగించలేదు.రాష్ట్ర విభజన జరిగిన తర్వాత పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించేందుకు 2024 జూలై 6వ తేదీన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశం అయి చర్చించారు. అనంతరం అధికారులు, మంత్రుల కమిటీలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. అయితే ఈ మీటింగ్ జరిగి కూడా 2 ఏళ్లు గడిచినా ఆస్తుల పంపకాల విషయంలో ఎలాంటి పురోగతి కనిపించలేదు.లేక్ వ్యూ గెస్ట్ హౌస్ వంటి కీలక ప్రభుత్వ భవనాల బదిలీ కూడా ఏపీ, తెలంగాణ మధ్య వివాదంగానే కొనసాగుతోంది. ఈ భవనాన్ని తిరిగి అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం కోరగా.. షెడ్యూల్–9, షెడ్యూల్–10 కింద ఆస్తుల విభజనతో పాటు ఇతర పెండింగ్ అంశాలు ఇంకా పరిష్కారం కాలేదని పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో ఆ విజ్ఞప్తిని తిరస్కరించింది.ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ఆధీనంలో ఉన్న భవనాల్లో మలక్‌పేట్‌లోనే అత్యధికంగా 308 భవనాలు ఉన్నాయి. పాటిగడ్డలో 95, ఎర్రమంజిల్‌లో 67, కుందన్‌బాగ్‌లో 44, బంజారాహిల్స్‌లో 33, ఖలాదేరాలో 13, సైఫాబాద్‌లో 12, పంజాగుట్టలో 9, మదన్నపేటలో 8 భవనాలు ఇప్పటికీ ఏపీ వద్దే ఉన్నాయి. ఆస్తుల విభజనతో పాటు నదీ జలాల పంపకం, ప్రాజెక్టుల అనుమతులు వంటి పలు కీలక అంశాలు కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో రాష్ట్ర విభజనకు సంబంధించిన ప్రధాన సమస్యలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# రేవంత్ కు గ్రేటర్ కలవరం

**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అంత సులువు కాదు. అధికారంలో ఉన్నారన్న మాటే కానీ గ్రేటర్ ఎన్నికలపై కొంత ఆందోళన కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అనేక అంశాలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశముంది. మొన్నటి ఎన్నికల్లోనూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్‌కు ఒక్క శాసనసభ నియోజకవర్గంలోనూ గెలవలేదు. తర్వాత జరిగిన రెండు ఉప ఎన్నికల్లో మాత్రం గెలిచి హైదరాబాద్ లో కాంగ్రెస్ కు ప్రాతినిధ్యం లభించినట్లయింది. అయితే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు మాత్రం అంత సులువు కాదన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ నగర అభివృద్ధి కంటే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలపై దృష్టి పెట్టిందన్న విమర్శలున్నాయి. బీఆర్ఎస్ హయాంలో వేగంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, కానీ కాంగ్రెస్ హయాంలో కొంత హైదరాబాద్ లో అభివృద్ధి వెనకబడి ఉందని అంటున్నారు. రియల్ ఎస్టేట్ కూడా పెద్దగా ముందుకు పోవడం లేదు. అనేక ఇళ్లు కొనుగోలు చేయకుండా మూలన పడి ఉన్నాయి. ఇదే సమయంలో రహదారులు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. వర్షం కురిస్తే చాలు మ్యాన్ హోల్స్ లో పడి మృతులు కూడా ఇటీవల కాలంలో ఎక్కువవుతున్నారు. అలాగే

# బిజినెస్

## దేశ సరిహద్దు జిల్లాల బ్యాంకులకు ఆర్‌బీఐ కీలక ఆదేశాలు



దేశంలో నకిలీ కరెన్సీ చలామణిని అరికట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. పొరుగు దేశాలతో సరిహద్దులు పంచుకుంటున్న జిల్లాల్లోని అన్ని బ్యాంకు శాఖల్లో నోట్ల ప్రామాణికతను పరిశీలించే (అథెంటికేషన్), వేరుచేసే (సార్టింగ్) యంత్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. నకిలీ నోట్లను గుర్తించడంలో కొన్ని బ్యాంకుల పనితీరు సంతృప్తికరంగా లేదని గమనించిన ఆర్‌బీఐ, ఈ మేరకు నూతన సర్క్యులర్‌ను విడుదల చేసింది. బ్యాంకులకు వచ్చే ప్రతి నోటు ప్రామాణికతను యంత్రాల ద్వారా విధిగా నిర్ధారించుకోవాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఒకవేళ నకిలీ నోటును గుర్తిస్తే, దాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగదారుడికి తిరిగి ఇవ్వకూడదని లేదా బ్యాంకులోనే ధ్వంసం చేయకూడదని తేల్చిచెప్పింది. గుర్తించిన నకిలీ నోట్ల వివరాలను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత అధికారులకు నివేదించాలని సూచించింది. ఈ నిబంధనల అమలులో భాగంగా, బ్యాంకుల్లో నగదు లావాదేవీలు నిర్వహించే ప్రతి ఉద్యోగికి అసలు నోట్ల భద్రతా ఫీచర్లపై సమగ్ర శిక్షణ ఇవ్వాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ఈ శిక్షణ ప్రక్రియను 2026 అక్టోబర్ 31 నాటికి పూర్తి చేయాలని గడువు విధించింది. నకిలీ నోట్లపై నిఘా ఉంచేందుకు ఏర్పాటు చేసిన 'ఫోర్జ్ నోట్ విజిలెన్స్' (ఎఫ్ఎన్‌వీ) సెల్స్ ద్వారా డేటాను విశ్లేషించి, నకిలీ కరెన్సీ ఎక్కువగా చలామణి అవుతున్న ప్రాంతాలను (హాట్‌స్పాట్‌లు) గుర్తించాలని పేర్కొంది. బ్యాంకులో ఎవరైనా నకిలీ నోటు అందజేస్తే, దానిపై స్టాంప్ వేసి, సదరు వ్యక్తికి నిర్దేశిత నమూనాలో రసీదు ఇవ్వాలని ఆర్‌బీఐ తెలిపింది. ఈ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని బ్యాంకు శాఖల్లో వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించింది. ఈ పటిష్ట చర్యల ద్వారా నకిలీ కరెన్సీని గుర్తించి, నివేదించే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకుంది.

## ఫ్లిప్‌కార్ట్ వినియోగదారులకు రివార్డుగా నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్

ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్.. ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్‌తో జట్టు కట్టింది. తన ప్లస్ లాయల్టీ మెంబర్లకు నెట్‌ఫ్లిక్స్ మొబైల్‌ప్లాన్‌ను ఉచితంగా అందించనుంది. నెలవారీ షాపింగ్ ఆధారంగా ఈ రివార్డును ఇవ్వనుంది. ఆగస్టు 1 నుంచి కొత్త రివార్డు ప్రోగ్రామ్‌ను ప్రారంభించనుంది. ఒక క్యాలెండర్ నెలలో నాలుగు సార్లు రూ.299, లేదా అంతకంటే ఎక్కువ మొత్తం షాపింగ్ చేసిన వినియోగదారులకు ఈ మొబైల్ ప్లాన్ ఉచితంగా లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, ఫ్లిప్‌కార్ట్ గ్రాసరీ, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌లో ఆర్డర్లకు ఇది వర్తిస్తుంది. నాలుగో ఆర్డర్ పూర్తయిన నాటి నుంచి 30 రోజుల పాటు మొబైల్ ప్లాన్ చెల్లుబాటు అవుతుంది. ఆ తదుపరి నెల కూడా నిర్ణీత ఆర్డర్ల విలువ దాటగానే నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్‌ను అన్‌లాక్ చేయొచ్చు. ప్రతి నెలా 4 ఆర్డర్లు పూర్తి చేయడం ద్వారా ఈ ప్రయోజనాన్ని ఉచితంగా కొనసాగించొచ్చు. ఫ్లిప్‌కార్ట్ ప్లస్ సభ్యులు కానివారూ ఈ ప్రయోజనాన్ని పొందొచ్చు. ఇందుకోసం 12 నెలల వ్యవధిలో 15 ఆర్డర్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. అప్పుడే ప్లస్ మెంబర్‌షిప్‌కి అర్హత సాధిస్తారు. అయితే, మొబైల్ ప్లాన్‌లో ఒక మొబైల్/టాబ్లెట్‌లో ఏదో ఒకదాంట్లో మాత్రమే చూసేందుకు వీలవుతుంది.

# ఒక్కరోజులో రూ.39 లక్షల కోట్లు..
# మైక్రోసాఫ్ట్ సంచలనం!



టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ షేర్ మార్కెట్లో సరికొత్త రికార్డు సృష్టించింది. కంపెనీ షేర్లు ఒక్క ట్రేడింగ్ సెషన్‌లో ఏకంగా 15.5 శాతం దూసుకెళ్లడంతో.. మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ దాదాపు 450 బిలియన్ డాలర్లు (సుమారు రూ.39 లక్షల కోట్లు) పెరిగింది. ఒకే రోజులో ఏ లిస్టెడ్ కంపెనీ సాధించని స్థాయిలో మార్కెట్ క్యాపిటలైజేషన్ పెరగడం ఇదే తొలిసారి. గతంలో ఎన్విడియా నెలకొల్పిన సుమారు 441 బిలియన్ డాలర్ల రికార్డును మైక్రోసాఫ్ట్ అధిగమించింది. మైక్రోసాఫ్ట్ షేర్లలో ఈ భారీ ర్యాలీకి ప్రధాన కారణం కంపెనీ ప్రకటించిన బలమైన త్రైమాసిక ఫలితాలే. జూన్‌తో ముగిసిన 2026 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 18 శాతం పెరిగి 90 బిలియన్ డాలర్లకు చేరింది. ముఖ్యంగా క్లౌడ్ విభాగం 'అజూర్' అంచనాలను మించి వృద్ధిని నమోదు చేయడం ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచింది.

**అజూర్ వృద్ధి 43 శాతం**

మైక్రోసాఫ్ట్‌కు కీలక ఆదాయ వనరుగా మారిన అజూర్ క్లౌడ్ సేవల ఆదాయం నాలుగో త్రైమాసికంలో ఏడాది ప్రాతిపదికన 43 శాతం పెరిగింది. ఇది మార్కెట్ అంచనాలను అధిగమించింది. అంతేకాదు, వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అజూర్ వృద్ధి దాదాపు 45 శాతంగా ఉండొచ్చని కంపెనీ అంచనా వేసింది. దీంతో కృత్రిమ మేధ (ూ×) సేవలకు సంస్థలు భారీగా ఖర్చు చేయడం కొనసాగిస్తున్నాయనే సంకేతం ఇన్వెస్టర్లకు లభించింది. మరో కీలక మైలురాయిగా.. అజూర్ వార్షిక ఆదాయం తొలిసారిగా 100 బిలియన్ డాలర్లను దాటింది. మైక్రోసాఫ్ట్ క్లౌడ్ మొత్తం వార్షిక ఆదాయం కూడా 200 బిలియన్ డాలర్ల స్థాయిని అధిగమించింది. దీంతో కంపెనీ భారీగా చేస్తున్న డేటా సెంటర్లు, చిప్‌లు, ూ× మౌలిక సదుపాయాల పెట్టుబడులు కేవలం ఖర్చులుగానే మిగలకుండా ఆదాయాన్ని సృష్టిస్తున్నాయనే అభిప్రాయం బలపడింది. జూలై 30న ర్యాలీ అనంతరం మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు 3.35 ట్రిలియన్ డాలర్లకు చేరింది. తాజా మార్కెట్ డేటా ప్రకారం ఎన్విడియా సుమారు 5 ట్రిలియన్ డాలర్లకు పైగా మార్కెట్ విలువతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

## మా ఏఐ మోడల్.. 3 కంపెనీలను హ్యాక్ చేసింది




క్లాడ్ చాట్‌బాట్ సృష్టికర్త, ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఆంత్రోపిక్ సంచలన విషయాన్ని బయటపెట్టింది. టెస్టింగ్ దశలో ఉన్న తమ ఏఐ మోడళ్లు పొరపాటున మూడు ఇతర కంపెనీల నెట్‌వర్క్‌లలోకి ప్రవేశించి హ్యాక్ చేశాయని ప్రకటించింది. తమ ఏఐ వ్యవస్థ ఇంకో ఏఐ కంపెనీ మోడల్‌ను హ్యాక్ చేసిందని చాట్‌జీపీటీ రూపకర్త ఓపెన్‌ఏఐ ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో.. తాము కూడా అప్రమత్తమై సైబర్‌సెక్యూరిటీ సమీక్ష చేపట్టినట్లు తెలిపింది. రికార్డులు పరిశీలిస్తుండగా.. ఈ ఏడాది ప్రారంభంలో హ్యాకింగ్ జరిగినట్లు గుర్తించామంది. హ్యాంకింగ్ వల్ల ప్రభావితమైన సంస్థలను తాము ఇప్పటికే సంప్రదించామని ఆంత్రోపిక్ వెల్లడించింది. అయితే వాటి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఆయా సంస్థలు బలహీనమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం వల్ల వాటి మౌలిక సదుపాయాలను క్లాడ్ దెబ్బతీసిందని పేర్కొంది. ఇది దురుద్దేశంతో చేసిన పని కాదని.. ఒక మోడల్ సామర్థ్యం ఏమిటో తెలియాలంటే దానిని విడుదల చేయడానికి ముందు భద్రతా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపింది. ఆ సమయంలో అనుకోకుండా ఈ సైబర్ భద్రత ఘటన చోటుచేసుకున్నట్లు వివరించింది. దీంతో అత్యాధునిక ఏఐ మోడళ్లతో సైబర్ భద్రతకు సవాళ్లు ఏర్పడవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# చీఫ్ సెలెక్టర్ రేసులో అశ్విన్..
# వరల్డ్‌కప్ ముందే బాధ్యతలు చేపట్టేనా!



వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ కంటే ముందు చీఫ్ సెలెక్టర్‌గా సేవలందిస్తున్న అజిత్ అగార్కర్ పదవీకాలం ముగియనుంది. సెప్టెంబర్‌తో అగార్కర్ కాలపరిమితి పూర్తి కానున్నందున తదుపరి ప్రధాన సెలెక్టర్ ఎవరు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అశావహులు చాలామందే ఉన్నప్పటికీ మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ రేసులో అందరికంటే ముందున్నాడనే కథనాలు వస్తున్నాయి. బీసీసీఐ కూడా అగార్కర్ స్థానంలో మాజీ ఆఫ్ స్పిన్నరైన యశ్‌కు బాధ్యతలు అప్పగించనుందనే వార్తలు నెట్టింట వైరలవుతున్నాయి. సీనియర్లను పక్కన పెట్టేసి.. కుర్రాళ్లకు పెద్దపీట వేయడంతో పాటు స్క్వాడ్ ఎంపిక కూడా అస్సలు బాగుండడం లేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ గడ్డపై టీ20 సిరీస్ ఓటమితో హెడ్‌కోచ్ గౌతం గంభీర్, ప్రధాన సెలెక్టర్ అగార్కర్ పనితీరపై విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో, పదవీకాలం ముగింపు దశలో ఉన్న గవార్కర్‌ను పొడిగిస్తారా? లేదా? అనేదానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. అప్పుడే అగార్కర్ వారసుడు ఎవరు? అనే చర్చ మొదలైంది. ఎందుకంటే.. మరో నెల రోజుల్లో(సెప్టెంబర్) చీఫ్ సెలెక్టర్‌గా అగార్కర్ పదవీకాలం ముగియనుంది. దాంతో, కాబోయే ప్రధాన సెలెక్టర్ ఎవరు? పోటీలో ఎవరెవరు ఉన్నారు? అనేది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. అగార్కర్ అనంతరం మాజీ ఆటగాడు రవించంద్రన్ అశ్విన్ ప్రధాన సెలెక్టర్ పదవిని చేపట్టే అవకాశముందనే వార్తలు వినిపిస్తున్నాయి. వచ్చే వన్డే ప్రపంచకప్ 2027 ముందే అశ్విన్ నియామకం జరుగుతుందని ఆన్‌లైన్‌లో కథనాలు వస్తున్నాయి. దాంతో.. ఒక్కసారిగా అశ్విన్ ఎక్స్‌లో ట్రెండ్ అవుతున్నాడు. రిటైర్మెంట్ అనంతరం సొంత యూట్యూబ్ ఛానెల్లో క్రికెట్ విశ్లేషణలు చేస్తున్న స్పిన్ దిగ్గజం మాత్రం ఈ వైరల్ వార్తలపై స్పందించలేదు. బీసీసీఐ సైతం అగార్కర్ మార్పుపై ఎలాంటి ప్రకటన ఇంకా చేయలేదు.

## భారత్‌కు తొలిసారి విచ్చేస్తున్న బ్రెజిల్.. కోల్‌కతాలో ఫ్రెండ్లీ మ్యాచ్..!



సాకర్ అభిమానులకు గుడ్‌న్యూస్. ఊహించినట్టుగానే బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టు భారత పర్యటన ఖరారైంది. ఆ దేశ సీనియర్ టీమ్ మొట్టమొదటిసారి ఇండియాకు రానుంది. ఫుట్‌బాల్‌ను అమితంగా ఇష్టపడే కోల్‌కతావాసులను అలరించేందుకు సాల్ట్ లేక్ స్టేడియంలో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడనుంది బ్రెజిల్ జట్టు. అక్టోబర్‌లో బ్లూ టైగర్స్‌తో ఈ మ్యాచ్ విషయాన్ని శుక్రవారం బ్రెజిలియన్ ఫుట్‌బాల్ సమాఖ్య అధికారికంగా వెల్లడించింది. ఫిఫా వరల్డ్‌కప్ జోష్ ముగిసినా.. భారత్‌లో మళ్లీ ఫుట్‌బాల్ సందడి మొదలవ్వనుంది. మేటి జట్లలో ఒకటైన బ్రెజిల్ అక్టోబర్‌లో ఇండియాకు వస్తోంది. భారత జట్టుతో మ్యాచ్ కోసం ఆ దేశ సీనియర్ జట్టు రావడం ఖరారైందని బ్రెజిలియన్ ఫుట్‌బాల్ సమాఖ్య వెల్లడించింది. ఫుట్‌బాల్ అంటే పడిచచ్చే జనమున్న కోల్‌కతాలో అక్టోబర్ 3వ తేదీన బ్లూ టైగర్స్‌ను బ్రెజిల్ ఢీకొట్టనుంది. 'ది గోట్ ఇండియా టూర్' పర్యటనలో లియోనల్ మెస్సీ బృందం అభిమానులతో మమేకమైన సాల్ట్ లేక్ మైదానంలో ఈ మ్యాచ్ జరుగనుంది. 'బ్రెజిల్ జాతీయ జట్టు షెడ్యూల్ కొనసాగుతోంది. ఆస్ట్రేలియాతో ఫ్రెండ్లీ మ్యాచ్ అనంతరం మా తర్వాతి అడుగు భారత్‌లో. మా ఫుట్‌బాల్ చరిత్రలో అదొక మరపురాని అధ్యాయం కానుంది. అక్టోబర్ 3వ తేదీన భారత గడ్డపై బ్రెజిల్ టీమ్ మొట్టమొదటి మ్యాచ్ ఆడనుంది. ఇందుకు కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియం వేదిక కానుంది. ఏళ్ల తరబడి బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టుకు భారీగా అభిమానులున్న కోల్‌కతాలో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడడం చాలా ప్రత్యేకం కానుంది. ఈ పర్యటన కోసం మేము ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం. మిమ్మల్ని కోల్‌కతాలో కలుస్తాం' అని సీబీఎఫ్ ఒక ప్రకటనలో పేర్కొంది. నెయ్‌మర్ సారథ్యంలోని బ్రెజిల్ ఫిఫా వరల్డ్‌కప్ 2026లో నాకౌట్ దశలోనే వెనుదిరిగిన విషయం తెలిసిందే.

# స్పోర్ట్స్

## శతక్కొట్టిన లంక బ్యాటర్.. చిత్తుగా ఓడిన పాకిస్తాన్




సొంతగడ్డపై శ్రీలంక మహిళల జట్టు గర్జించింది. డంబుల్లా వేదికగా జరిగిన తొలి టీ20లో శ్రీలంక ఓపెనర్ ఇమేషా దులాని (64 బంతుల్లో 101 నాటౌట్) అజేయ సెంచరీ చేయడంతో పాకిస్తాన్‌పై ఆరు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఇమేషాకు తోడుగా కెప్టెన్ చమేరి ఆటపట్టు (22 బంతుల్లో 39) రాణించడంతో పాక్ విధించిన 177 పరుగుల లక్ష్యాన్ని 19 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. పాక్ బౌలర్లలో నష్రా సంధు 2 వికెట్లు తీసింది. కాగా తన టీ20 కెరీర్‌లో తొలి సెంచరీ సాధించి ఇమేషా దులాని లంక తరఫున టీ20 క్రికెట్‌లో సెంచరీ సాధించిన రెండో మహిళా క్రికెటర్‌గా నిలిచింది. ఇంతకముందు 2024లో మలేషియాతో జరిగిన మ్యాచ్‌లో చమేరి ఆటపట్టు (119 నాటౌట్) లంక తరఫున శతక్కొట్టిన తొలి వుమెన్ బ్యాటర్‌గా నిలిచింది. సమరవిక్రమ (86 నాటౌట్, 2024లో ఐర్లాండ్‌పై) మూడో స్థానంలో ఉంది. అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ వుమెన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. ఓపెనర్లు షావాల్ జుల్ఫికర్ (41 బంతుల్లో 63) అర్ధసెంచరీ చేయగా, మునీబా అలీ (24 బంతుల్లో 42) రాణించింది. ఎమన్ నసీర్ (21), అయేషా జఫర్ (17) పర్వాలేదనిపించారు. లంక బౌలర్లలో కవిషా దిల్హారి 2 వికెట్లు తీయగా, కాయా కవింది, సుగంధిక, చమోడి ప్రబోద తలా ఒక వికెట్ తీశారు. ఇరుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ ఆదివారం జరగనుంది.



## త్రేత యుగంలో డిజైనర్ బ్లౌజ్‌లు,,


## 'రామాయణం' ట్రైలర్‌పై సోషల్ మీడియాలో చర్చ!

బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' ట్రైలర్ విడుదలైనప్పటి నుంచీ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలో రాణి కైకేయి పాత్రలో నటిస్తున్న ప్రముఖ నటి లారా దత్తా తొలి లుక్‌పై నెటిజన్లు రకరకాల కామెంట్లు చేస్తున్నారు. త్రేత యుగంలో సాగిన పురాణ గాథ ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో, లారా దత్తా ధరించిన మోడ్రన్ డిజైనర్ బ్లౌజ్, స్టైలిష్ హెయిర్‌స్టైల్ పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. త్రేత యుగ కాలానికి తగినట్లుగా కాకుండా, ప్రస్తుత కాలానికి తగ్గట్టుగా నీట్‌గా కుట్టిన డిజైనర్ బ్లౌజ్, స్ట్రైట్ హెయిర్, సెలూన్ స్టైల్ హెయిర్‌స్టైల్‌తో లారా కనిపించడంపై విమర్శలు వస్తున్నాయి. త్రేత యుగంలో ప్లెయిన్ రా సిల్క్ చీరలు, హెవీ స్టోన్ ఎంబ్రాయిడరీ, కాంట్రాస్ట్ బ్లౌజ్‌లు ఎవరూ డిజైన్ చేసేవారు? అంటూ కొందరూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇక లారా దత్తా లుక్ చూస్తుంటే రామాయణంలా కాకుండా, ఏవో ఏక్తా కపూర్ టీవీ సీరియల్ షూటింగ్‌లో పాల్గొన్నట్లుగా ఉందని మరికొందరు కామెంట్ చేశారు. ఇక సినిమా మేకర్స్ తీసుకున్న ఈ సృజనాత్మక స్వేచ్ఛ, కాస్ట్యూమ్ డిజైన్ పై వస్తున్న విమర్శలపై చిత్ర యూనిట్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి! మహర్షి వాల్మీకి రామాయణం, తులసీదాస్ రామచరితమానస్ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా, నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రంలో రణబీర్ కపూర్, యశ్, సాయి పల్లవి, రవి దూబే, అరుణ్ గోవిల్, వివేక్ ఒబెరాయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా 2026 దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.




# అభిమానులకు అప్‌డేట్..
# కార్తీ 'సర్దార్ 2' టీజర్ లాంచ్‌కి టైం ఫిక్స్!

కోలీవుడ్ టాలెంటెడ్ హీరో కార్తీ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా సీక్వెల్ చిత్రం 'సర్దార్ 2'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో గ్లామరస్ బ్యూటీ మాళవిక మోహనన్ కథానాయకిగా నటిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా, ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ఎప్పటికప్పుడు ఆసక్తికరమైన అప్‌డేట్స్ ఇస్తూ ప్రేక్షకుల్లో హైప్ క్రియేట్ చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఓ సాలిడ్ ట్రీట్ రాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ క్రమంలోనే హీరో కార్తీ తాజాగా ఒక పవర్-ప్యాక్డ్ కొత్త పోస్టర్‌ను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ అభిమానులకు అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పారు. 'సర్దార్ 2' సినిమా టీజర్‌ను నేడు శుక్రవారం సాయంత్రం సరిగ్గా 7 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ఆయన కన్ఫర్మ్ చేశారు. దీంతో కోలీవుడ్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోని కార్తీ అభిమానులు ఈ హై-వోల్టేజ్ టీజర్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొదటి పార్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ కావడంతో, ఈ సీక్వెల్‌పై అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఈ చిత్రంలో టాలెంటెడ్ నటుడు ఎస్.జె. సూర్య పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటిస్తుండటం సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది. ఇక మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సీఎస్, ఈసారి కూడా తన మ్యూజిక్‌తో అదరగొట్టడానికి సిద్ధమయ్యారు. అన్ని హంగులను పూర్తి చేసుకుని ఈ సినిమాను సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా అత్యంత గ్రాండ్‌గా పాన్ ఇండియా లెవెల్‌లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. నేడు రాబోతున్న టీజర్ సినిమాపై ఉన్న అంచనాలను రెట్టింపు చేయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.





## ఎంఎస్ రాజు 'అగాధ' ట్రైలర్‌కు డేట్ ఫిక్స్..
## ఆధ్యాత్మిక థ్రిల్లర్‌పై అంచనాలు పెంచుతున్న మేకర్స్!

సీనియర్ దర్శకుడు, నిర్మాత ఎంఎస్ రాజు మరోసారి దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'అగాధ'. మిస్టికల్ డివైన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటిస్తుండగా, ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన వివరాల ప్రకారం ఆగస్టు 3, 2026 మధ్యాహ్నం 12 గంటలకు 'అగాధ' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ ద్వారా సినిమా కథ, ఆధ్యాత్మిక నేపథ్యం, మిస్టరీ ఎలిమెంట్స్‌పై మరింత స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. విడుదలకు ముందే ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచేలా ట్రైలర్ ఉండబోతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ ప్రొ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అజయ్ కెఆర్ సమర్పిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను ఎంఎస్ రాజు స్వయంగా నిర్వహించడం విశేషం. తన కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించిన ఆయన, ఈసారి విభిన్నమైన ఆధ్యాత్మిక థ్రిల్లర్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్లతో పాటు శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు, రోషన్, శ్రేయా రాణి రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రతి పాత్రకూ కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని చిత్రబృందం చెబుతోంది. భారీ స్థాయిలో రూపొందిన 'అగాధ' చిత్రం ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుండటంతో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో తీసుకురాబోతున్నారు. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, ట్రైలర్ విడుదల అనంతరం మరింత దూకుడుగా ప్రమోషన్స్ నిర్వహించనుంది. మిస్టరీ, ఆధ్యాత్మికత, థ్రిల్లింగ్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన ఈ చిత్రం ఎంఎస్ రాజుకు దర్శకుడిగా మరో విజయాన్ని అందిస్తుందా అనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది.

# షూటింగ్‌లో రష్మిక మందన్నాకు గాయం.. వైద్యుల సూచనలు ఇవే..!

టాలీవుడ్‌ను గాయాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే పలువురు హీరోలు అనుకోకుండా ఆస్పత్రి పాలవ్వగా.. స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నా సైతం గాయపడింది. 'మైసా', 'రణబాలి' చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక షూటింగ్‌లో యాక్షన్, నృత్య సన్నివేశాలు తెరకెస్తుండగా తీవ్రంగా గాయపడింది. సత్వరం చికిత్స అందించి.. ఆమెకు పూర్తిగా ఆరు వారాలు విశ్రాంతి సూచించారు డాక్టర్లు. దాంతో, తెలుగింటి కోడలు కొన్ని వారాలు షూటింగ్‌కు దూరం కానుంది. 'గీతగోవిందం', 'పుష్ప', 'గర్ల్‌ఫ్రెండ్' ఫేమ్ రష్మిక మందన్నా షూటింగ్ సమయంలో గాయపడింది. మైసా, రణబాలి చిత్రాల కోసం కష్టమైన యాక్షన్, నృత్య సన్నివేశాలు తీస్తుండగా రష్మిక గాయపడింది. దాంతో, వెంటనే ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. రష్మికను పరీక్షించిన వైద్యులు గాయం తీవ్రత పెద్దదేనని, కనీసం ఆరువారాలు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.




## 'బట్వారా 1947' పోస్టర్ వైరల్..
### కనికా కపూర్‌ను చూసి కియారా అద్వానీ అనుకున్న నెటిజన్లు!

బాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'బట్వారా 1947' సినిమా విడుదలకు ముందే సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషీ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో సన్నీ డియోల్ ప్రధాన పాత్ర పోషిస్తుండగా, ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన ఓ క్యారెక్టర్ పోస్టర్ ఇప్పుడు నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న నటి కనికా కపూర్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఫ్లోరల్ సూట్, లైట్ బ్రౌన్ దుపట్టాతో ఎలాంటి గ్లామర్ హంగులు లేకుండా సింపుల్ లుక్‌లో కనిపించిన కనికాను చూసిన నెటిజన్లు ఒక్కసారిగా షాక్ అయ్యారు. పోస్టర్‌లో ఆమె రూపం బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీని పోలి ఉండటంతో సోషల్ మీడియాలో పోలికలపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. "ఇది కనికా కపూర్ కాదు.. కియారా అద్వానీయే కదా?", "పోస్టర్‌లో కియారా పేరు ఎందుకు లేదు?", "ఏఐతో పోస్టర్ డిజైన్ చేశారా?" అంటూ పలువురు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం లైటింగ్, మేకప్, ఫోటో ఎడిటింగ్ కారణంగానే ఈ పోలికలు వచ్చాయని అభిప్రాయపడుతున్నారు. ఈ పోస్టర్ వైరల్ కావడంతో కనికా కపూర్ కూడా సరదాగా స్పందించారు. సోషల్ మీడియాలో తనను కియారా అద్వానీతో పోలుస్తూ వచ్చిన ఓ కామెంట్‌కు ఆమె నవ్వుతున్న ఎమోజీతో రిప్లై ఇచ్చారు. దీంతో ఈ చర్చకు మరింత ఊపు వచ్చింది. అయితే కనికా కపూర్ ఇతర ఫొటోలను పరిశీలిస్తే ఆమెకు కియారా అద్వానీతో పెద్దగా పోలికలు కనిపించవని అభిమానులు చెబుతున్నారు. ఈ ఒక్క పోస్టర్‌లో మాత్రమే కెమెరా యాంగిల్, లైటింగ్, మేకప్ కారణంగా ఇద్దరి రూపాల్లో సారూప్యత కనిపించిందని అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీకి చెందిన కనికా కపూర్ 'బట్వారా 1947' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. అంతకుముందు 'ఏక్ దుజే కే వాస్తే 2' వంటి టెలివిజన్ సీరియల్స్, పలు వెబ్ సిరీస్‌లు, మోడలింగ్ రంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. పలు బ్యూటీ పేజెంట్లలో విజేతగా నిలిచిన ఆమె చిన్నప్పటి నుంచే నటిగా రాణించాలని కలలు కనగా, ఇప్పుడు భారీ బాలీవుడ్ ప్రాజెక్ట్‌తో సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు.




PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PUBLICATIONS. AT M/S SMIL YS ONLINE H.NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500 O70 AND PUBLISHED AT VIPLAV MEDIA PUBLICATIONS. H.NO : 18-7-496 KANDIKAL GATE, UPPUGUDA, HYDERABAD, TELANGANA - 500 053. CEO & CHIEF EDITOR VANGA NAGARAJ REDDY (RAJU), EDITOR VANGA VIPLAV TEJA. PRGI : TGBIL/26/A2289. PHONE NO: +9184990 94183, +9193945 17067